తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | బుధవారం-19- నవంబర్ 2025 | సంపుటి : 3 | సంచిక : 172 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




## కోటి మంది మహిళలకు

# సిరిసిల్ల చీరలు



- రెండు దశల్లో చీరల పంపిణీ
- నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యత
- సిరిసిల్ల చేనేత కార్మికుల తయారీ
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి


హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని రాష్ట్రంలోని కోటి మంది మహిళలకు కోటి చీరలను పంపిణీ చేసే ఇందిరమ్మ చీరలు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం అమలుపై మంత్రి ధనసరి అనసూయ సీతక్కతో పాటు ఉన్నతాధికారుల సమావేశంలో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీరను అందించాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టంగా సూచించారు. మహిళలకు నాణ్యమైన వస్త్రాలను అందించడం ద్వారా వారికి గౌరవాన్ని పెంచడమే లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించినట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేయాల్సిన ఈ చీరలను పూర్తిగా సిరిసిల్ల చేనేత కార్మికులు తయారు చేస్తున్నారు. చేనేత రంగాన్ని ప్రోత్సహించడానికి, వారికి ఉపాధి కల్పించడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, చీరల ఉత్పత్తి ఆలస్యం అవుతున్న నేపథ్యంలో, ఉత్పత్తికి అనుగుణంగా చీరల పంపిణీని రెండు

మిగతా 2లో

## గ్రూప్-2 ఎంపిక జాబితాను

# రద్దు చేసిన హైకోర్టు



- 2015–16 గ్రూప్-2 ఎంపికలపై హైకోర్టు పెను సంచలనం
- టీజీపీఎస్సీ విధానంపై ధర్మాసనం తీవ్ర అసహనం
- వైట్నర్, దిద్దుబాటుతో ఉన్న జవాబుపత్రాలపై కోర్టు ఆగ్రహం
- 8 వారాల్లో పునర్మూల్యాంకనంతో కొత్త అర్హుల జాబితా
- పిటిషన్‌లపై సుదీర్ఘ విచారణ తర్వాత జస్టిస్ నాగేశ్ భీమపాక తీర్పు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

పదేళ్ల క్రితం నిర్వహించిన గ్రూప్2 పరీక్ష ఎంపిక జాబితాను తెలంగాణ హైకోర్టు రద్దు చేసింది. 2015 16లో నిర్వహించిన గ్రూప్2లో ఎంపికైన వారి జాబితాను రద్దు చేస్తూ ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు

మిగతా 2లో

## ఓలింపిక్స్‌లో ఎషా సింగ్ ప్రతిభ

- సీతక్క అభినందనలు
- ఒలింపిక్స్‌లో తొలి కాంస్యం
- రెండు రజతాలతో తెలంగాణ గర్వం
- ప్రజాభవన్‌లో సీతక్కను కలిసిన ఎషా

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

అంతర్జాతీయ వేదికపై భారత పతాకాన్ని ఎగురవేసిన తెలంగాణ కూతురు ఎషా సింగ్ విజయాలను మంత్రి దానసరి సీతక్క అభినందించారు. ప్రజాభవన్‌లో సీతక్కను కలిసి శుభాకాంక్షలు అందుకున్న ఎషా, 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ విభాగంలో భారత ఒలింపిక్ చరిత్రలో తొలి కాంస్య పతకాన్ని సాధించి కొత్త రికార్డు సృష్టించడం విశేషమని సీతక్క పేర్కొన్నారు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ మరియు 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ విభాగాల్లో ఎషా సింగ్ మరో రెండు రజత పతకాలను గెలుచుకోవడం తెలంగాణకు, దేశానికి గర్వకారణమని ఆమె అభినందించారు. ఒలింపిక్ స్థాయిలో ఇటువంటి ప్రతిభ కనబరచడం యువతకు స్ఫూర్తిదాయకమని సీతక్క పేర్కొన్నది. దేశ కీర్తి కోసం ఎషా సింగ్ మరెన్నో పతకాలు సాధించాలని కోరుకుంటున్నామని సీతక్క తెలిపారు. భవిష్యత్తులో కూడా ఎషా భారత్‌కు మరిన్ని విజయాలు, ఆనందాలు అందిస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.






## సనాతన ధర్మంపై తన వైఖరిని

# స్పష్టం చేసిన బండి సంజయ్

- హిందుత్వంపై గర్వంగా మాట్లాడుతాను... ఎప్పటికీ తగ్గించను
- పహల్‌గామ్ ఘటనను గుర్తుచేసిన బండి సంజయ్
- సివిలైజేషనల్ రూట్స్ మన బలం : బీజేపీ నేత వ్యాఖ్యలు

2లో

## చారిత్రాత్మక శాసన మండలి పునరుద్ధరణ



- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలన, కీలక సూచనలు
- చైర్మన్, స్పీకర్‌తో కలిసి పరిశీలన
- మరమ్మతు పనులకు ముఖ్యమంత్రి సూచనలు
- చారిత్రాత్మక భవనానికి పూర్వవైభవం

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మంగళవారం శాసన మండలి భవన పునరుద్ధరణ పనులను స్వయంగా పరిశీలించారు. చారిత్రాత్మక అసెంబ్లీ ప్రధాన భవనంలో ఉన్న పాత శాసన మండలిని పునరుద్ధరించాలని గతంలోనే నిర్ణయం తీసుకున్న

మిగతా 2లో



## రీజినల్ మీటింగ్‌లో పాల్గొన్న సీఎం రేవంత్

- 2035 నాటికి ట్రిలియన్ డాలర్ తెలంగాణ
- కేంద్ర సహకారం కోరిన సీఎం
- జీడీపీలో 10% లక్ష్యంగా తెలంగాణ

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

హైదరాబాద్‌లో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ సారథ్యంలో జరిగిన అర్బన్ డెవలప్‌మెంట్ మినిస్టర్స్ రీజినల్ మీటింగ్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా పట్టణీకరణ, స్మార్ట్ సిటీల అభివృద్ధి, భవిష్యత్ మౌలిక వసతుల నిర్మాణానికి సంబంధించిన కీలక అంశాలపై జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ ప్రాధాన్యతలు, లక్ష్యాలను సీఎం వివరించారు. సీఎం రేవంత్ మాట్లాడుతూ,

మిగతా 2లో

## మానవత్వం చాటి చూపిన ఆర్టీసీ డ్రైవర్



- సూర్యాపేటలో చిన్నారిని ప్రేమగా చూసుకున్న డ్రైవర్‌కు ప్రశంసలు
- తల్లి తిరిగివచ్చే వరకు శిశువుకు ఆలనాపాలన – బాధ్యతగల ఉద్యోగి ప్రతిభ
- సేవ మాత్రమే కాదు... మనసున్న మనుషులు కూడా ఆర్టీసీ బలం
- మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

విధి నిర్వర్తనలోనే కాదు, మానవత్వంలోనూ ఆదర్శంగా నిలిచే ఆర్టీసీ సిబ్బందిలో మరో ఉదాహరణ వెలుగులోకి వచ్చింది. సూర్యాపేట బస్టాండ్ వద్ద తన చిన్నారితో

మిగతా 2లో

## నా భార్య, నా అత్త వల్లే ఈరోజు నేను ఇలా అయ్యా



- ఐ బొమ్మ రవి పోలీసుల ఎదుట సంచలన ఒప్పుకోలు
- వెబ్‌డిజైనర్ నుంచి ఐ బొమ్మ సైట్ నిర్వాహకుడిగా మారిన కథ
- గృహ సమస్యలు, అవహేళనలు తనను నేరాల దారిలోకి నెట్టాయని వాపోకు
- భావోద్వేగంతో రవి వెల్లడించిన పలు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

ప్రముఖ పైరసీ వెబ్‌సైట్ 'ఐ బొమ్మ' కేసులో అరెస్ట్ అయిన రవి పోలీసుల విచారణలో సంచలన వ్యాఖ్యలు చేశాడు. తనను ఈ దారిలోకి నెట్టింది కుటుంబంలోని అవహేళనలు, భార్య-అత్త ఒత్తిడేనని కంటతడి పెట్టి చెప్పినట్టు సమాచారం. బెట్టింగ్ యాప్స్, లోన్ యాప్స్ ద్వారా భారీగా సంపాదించిన డబ్బు కూడా తన కుటుంబం నమ్మలేదని, దీనివల్లనే తన జీవితం నేర దారిలోకి మళ్లిపోయిందని రవి వెల్లడించాడు.

మిగతా 2లో



## బూత్ స్థాయి నిర్మాణంపై దృష్టి

- టీఎస్ బీజేపీ సమీక్షా సమావేశానికి నేతృత్వం వహించిన రాంచందర్ రావు
- రాబోయే నెలల వ్యూహాలపై చర్చలు
- బలమైన తెలంగాణ బీజేపీ – బలమైన భారత్" లక్ష్యంగా ఏకమవుతున్న నేతలు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ బీజేపీ ప్రధాన కార్యదర్శులు, మోర్చా అధ్యక్షులతో రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కీలక సమీక్షా సమావేశానికి తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు నేతృత్వం వహించారు. పార్టీ బలోపేతం, కార్యకర్తల సమన్వయం, బూత్ స్థాయి ఆధారాన్ని

మిగతా 2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## కోటి మంది మహిళలకు

# సిరిసిల్ల చీరలు



(మొదటి పేజీతరువాయి)

దశల్లో చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ విధంగా పంపిణీ చేయడం ద్వారా సిరిసిల్ల కార్మికులకు పూర్తిస్థాయిలో పని కల్పించినట్లవుతుందని, లబ్ధిదారులకు కూడా నిరంతరాయంగా చీరలు అందుతాయని ప్రభుత్వం భావిస్తోంది. పంపిణీ యొక్క తొలి దశలో, ఇందిరా గాంధీ జయంతి రోజు నుంచి డిసెంబరు 9 తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం వరకు గ్రామీణ ప్రాంతాల్లో చీరల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రెండవ దశలో పట్టణ ప్రాంతాల్లో మార్చి 1 నుంచి మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం వరకు చీరల పంపిణీ పూర్తి చేయాలన్నారు. ఈ రెండు ముఖ్యమైన తేదీలను ఎంచుకోవడం ద్వారా పథకానికి మరింత ప్రాధాన్యత లభిస్తుందని ప్రభుత్వం యోచిస్తోంది. నిర్ణీత లక్ష్యాలకు అనుగుణంగా పంపిణీని పూర్తి చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

చీరల పంపిణీలో నాణ్యత విషయంలో రాజీ పడొద్దని, మహిళలకు నాణ్యమైన చీరలను అందించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేకాకుండా, సాంకేతికను వినియోగించుకుని ఇందిరమ్మ చీరల పంపిణీ పారదర్శకంగా జరిగేలా చూడాలని, పంపిణీ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. అర్హులందరికీ లబ్ధి చేకూరుతుందని, ఎక్కడా అవకతవకలు జరగడానికి వీలు లేదWని ముఖ్యమంత్రి అన్నారు. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు నెక్లెస్ రోడ్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పించిన అనంతరం ముఖ్యమంత్రి చీరల పంపిణీని లాంఛనంగా ప్రారంభిస్తారు. అనంతరం సెక్రటేరియట్ నుంచి గ్రామీణ ప్రాంత మహిళలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి మాట్లాడుతారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందుబాటులో ఉన్న కలెక్టరేట్ల నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు.

## గ్రూప్-2 ఎంపిక జాబితాను

# రద్దు చేసిన హైకోర్టు

(మొదటి పేజీతరువాయి)

జారీచేసింది. హైకోర్టు ఆదేశాలను టీజీపీఎస్సీ ఉల్లంఘించిందని, పరిధిదాటి వ్యవహరించిందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పునర్ మూల్యాంకనం చేసి అర్హుల జాబితా నిర్ణయించాలని, ఈ ప్రక్రియ 8 వారాల్లో ముగించాలని హైకోర్టు ఆదేశించింది.

వైట్నర్, దిద్దుబాటు ఉన్న జవాబుపత్రాల మూల్యాంకనంపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ట్యాంపరింగ్ జరిగినట్లు తెలిసినా.. మూల్యాంకనం చేయడం చట్ట విరుద్ధమని కోర్టు పేర్కొంది. సాంకేతిక కమిటీ సూచన ప్రకారం పునర్‌మూల్యాంకనం చేయాలని ఆదేశించింది. 2015లో టీజీపీఎస్సీ గ్రూప్2 నోటిఫికేషన్ జారీ



చేసింది. 2016 నవంబర్‌లో రాతపరీక్షలు నిర్వహించింది. 2019లో గ్రూప్2 నియామకాలు చేపట్టింది. దీనిపై పలువురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన జస్టిస్ నగేశ్ భీమపాక తీర్పు వెలువరించారు.

# స్పష్టం చేసిన బండి సంజయ్

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)




కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ హిందుత్వ, సనాతన ధర్మంపై తన దృఢమైన వైఖరిని మరోసారి స్పష్టం చేశారు. సనాతన ధర్మం మన నాగరికతకు మూలస్తంభమని, దానిపై గర్వంతో మాట్లాడటంలో ఎలాంటి సంకోచం లేదని ఆయన పేర్కొన్నారు. సనాతన విలువలను కాపాడటానికి తాను ఎలాంటి ఒత్తిడికీ, విమర్శకులకీ వెనక్కి తగ్గబోనని బండి సంజయ్ తెలిపారు. "మన పెద్ద బలం మన సంస్కృతి... మన సనాతన ధర్మం. దీనిపై నేను గర్వంగా మాట్లాడుతాను. ఎవరైనా ప్రశ్నించినా, ఒత్తిడి తీసుకురావాలనుకున్నాదానిని తగ్గించను" అని వ్యాఖ్యానించారు. పహల్‌గాంలో హిందువులపై జరిగిన ఉగ్రదాడులను గుర్తుచేసిన బండి సంజయ్, ఈ ఘటనలు మన నాగరికతను కాపాడుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తున్నాయని అన్నారు. పొరుగు దేశాల్లో జరుగుతున్న పరిస్థితులను చూస్తే నాగరికత విలువలను రక్షించాల్సిన బాధ్యత మరింత పెరిగిందని తెలిపారు. ప్రతి హిందువు సనాతన ధర్మంపై గర్వంగా నిలబడాలని, మన సంస్కృతిని కాపాడటంలో ఎలాంటి రాజీ ఉండకూడదని బండి సంజయ్ పిలుపునిచ్చారు. మన మూలాలను రక్షించుకోవడం దేశ భవిష్యత్తు కోసం అత్యవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. బండి సంజయ్ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# చారిత్రాత్మక శాసన మండలి పునరుద్ధరణ

(మొదటి పేజీతరువాయి)

నేపథ్యంలో, ఈ మరమ్మతు పనులు ఏ విధంగా జరుగుతున్నాయో తెలుసుకునేందుకు ఆయన ఈ పర్యటన చేపట్టారు. ముఖ్యమంత్రి ఈ సందర్భంగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మరియు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ లతో కలిసి భవనాన్ని కలియతిరిగారు. భవన పరిశీలన సమయంలో ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. చారిత్రక నేపథ్యం కలిగిన ఈ భవనం యొక్క నిర్మాణ శైలి మరియు గొప్పదనం చెక్కుచెదరకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పునరుద్ధరణ పనులు జరుగుతున్న తీరును, వినియోగిస్తున్న వస్తువుల నాణ్యతను గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మరియు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో పాటు అధికారులు భవనం యొక్క ప్రస్తుత స్థితి, చేపట్టాల్సిన పనుల వివరాలను ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్ర శాసన వ్యవహారాలలో కీలక పాత్ర పోషించే ఈ మండలి భవనాన్ని అత్యంత నాణ్యతతో, ఆధునిక సదుపాయాలతో పునరుద్ధరించాలని ఆయన ఆకాంక్షించారు. చారిత్రక భవ



నాలకు పూర్వవైభవం తీసుకురావడంలో ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధిని ఈ పర్యటన తెలియజేస్తోంది. ఈ మరమ్మతులు పూర్తయితే, శాసన మండలి సమావేశాలు మరింత సులభంగా, సౌకర్యవంతంగా నిర్వహించడానికి అవకాశం లభిస్తుంది.

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మరియు చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పునరుద్ధరణ పనుల వివరాలు, ఎదురవుతున్న సవాళ్లు మరియు భవిష్యత్తు ప్రణాళికలను సమగ్రంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. చారిత్రక భవనంలో మరమ్మతులు చేపట్టేటప్పుడు సాంప్రదాయ శైలిని కొనసాగించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరాన్ని అధికారులు ప్రస్తావించారు. భవిష్యత్తులో శాసనమండలి సమావేశాలు సజావుగా జరిగేందుకు వీలుగా అన్ని రకాల సాంకేతిక ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మొత్తంగా, ఈ పునరుద్ధరణ పనుల పర్యవేక్షణ ద్వారా రాష్ట్ర పరిపాలనా భవనాలకు ముఖ్యమంత్రి ఇస్తున్న ప్రాధాన్యత స్పష్టమవుతోంది. ముఖ్యమంత్రి మార్గదర్శకాలను అనుసరించి పునరుద్ధరణ పనులను వేగవంతం చేయడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ చారిత్రక శాసన మండలి భవనం త్వరలోనే పునరుద్ధరణ పూర్తి చేసుకొని, రాష్ట్ర శాసనసభ యొక్క ఘనమైన చరిత్రను ప్రతిబింబిస్తూ పూర్వవైభవంతో కొత్త రూపం సంతరించుకోనుంది.

# మానవత్వం చాటి చూపిన ఆర్టీసీ డ్రైవర్

(మొదటి పేజీతరువాయి)

ప్రయాణిస్తున్న మహిళ వ్యక్తిగత అవసరాల కోసం బస్సు దిగగా, ఆ శిశువును చూసేందుకు ఎవరూ లేకపోయారు. ఈ పరిస్థితిని గమనించిన మనుగూరు ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్, ఆ చిన్నారిని ప్రేమగా చూసుకుంటూ, జాగ్రత్తగా దగ్గర పెట్టుకుని తన మానవీయతను చాటుకున్నారు. శిశువును సురక్షితంగా కాపాడుతూ, తల్లి తిరిగి వచ్చే వరకు దాని పట్ల ఆప్యాయత చూపిన ఈ డ్రైవర్ వ్యవహారం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతోంది. తిరిగి వచ్చిన తల్లికి ఆ చిన్నారిని సంపూర్ణంగా సురక్షితంగా అప్పగించిన ఈ సంఘటన ప్రజలను అట్టడుగునుంచి హత్తుకుంటోంది. ఈ సంఘటనపై స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఆ డ్రైవర్ సేవా భావాన్ని హృదయపూర్వకంగా అభినందించారు. "ఆర్టీసీ అంటే కేవలం ప్రయాణ సేవ మాత్రమే కాదు... మనసున్న మనుషుల తోటి సురక్షిత ప్రయాణం కూడా" అని ఆయన అన్నారు. డ్రైవర్ చేసిన ఈ మానవీయ చేష్ట ఆర్టీసీ ప్రతిష్ఠకు మరింత మెరుగులు దిద్దిందని ప్రశంసించారు. ప్రజలు, ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది అందరూ ఈ ఘటనను హృదయపూర్వకంగా స్మరిస్తూ, ఇటువంటి



మానవీయ సేవలు సమాజంలో ఇంకా ఉన్నాయని గర్వంగా పేర్కొంటున్నారు.

# రీజినల్ మీటింగ్‌లో పాల్గొన్న సీఎం రేవంత్

(మొదటి పేజీతరువాయి)

తెలంగాణను 2035 నాటికి ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం వేగవంతమైన చర్యలు తీసుకుంటుందని ఐటీ, పరిశ్రమలు, మౌలిక వసతులు, శక్తి, రవాణా రంగాల్లో భారీ పెట్టుబడులను తెలంగాణ ఆకర్షిస్తోందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి పథకాలకు కేంద్రం పూర్తిస్థాయి మద్దతు అందించాల్సిన అవసరం ఉందని ఈ సమావేశం వేదికగా అన్నారు.

ప్రత్యేకంగా రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం, మూసీ నది పునరుద్ధరణ, హైదరాబాద్‌కు గోదావరి జలాల తరలింపు, భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం వంటి అధిక ప్రాధాన్యత గల ప్రాజెక్టులు తెలంగాణ పట్టణాభివృద్ధిని పూర్తిగా మార్చగలవని సీఎం పేర్కొన్నారు. కేంద్ర అనుమతులు త్వరగా లభిస్తే ఈ ప్రాజెక్టుల అమలు మరింత వేగం అందుకుంటుందని అభిప్రాయపడ్డారు.

తెలంగాణ మోడల్ దేశానికి ఆదర్శమవుతోందని, ఉద్యోగాలు, పెట్టుబడులు, నగ




రాభివృద్ధి రంగాల్లో దేశంలోనే ప్రముఖ స్థానాన్ని తెలంగాణ సాధించిందని రేవంత్ తెలిపారు. ప్రజా సేవలు, మౌలిక వసతులు, పచ్చదనం, పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం దిశానిర్దేశకమైన సంస్కరణలు అమలు చేస్తోందని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవ శతాబ్ది అయిన 2047 నాటికి దేశ జీడీపీలో 10 శాతం వాటాను తెలంగాణ ఒక్కటే అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం తెలిపారు. దీనికి తగిన విధంగా నగరాల విస్తరణ, రవాణా నెట్‌వర్క్ బలోపేతం, శుద్ధి చేసిన నీరు మరియు పునరుత్పాదక శక్తి వినియోగం వంటి ముప్పై ఏళ్ల దృక్పథ ప్రణాళికను అమలు చేస్తున్నామని వివరించారు. రీజినల్ మీటింగ్‌లో సీఎం రేవంత్ చేసిన ప్రసంగం తెలంగాణ అభివృద్ధిపై రాష్ట్ర సంకల్పాన్ని మరింత బలంగా ప్రతిబింబించిందని పలువురు అధికారులు అభిప్రాయపడ్డారు.

# ఐబొమ్మ రవి కేసులో ఈడీ ఎంట్రీ

- మనీలాండరింగ్ కోణంలో లోతైన విచారణకు రంగం సిద్ధం
- బెట్టింగ్ యాప్స్ ద్వారా నిధుల సమీకరణ
- క్రిప్టో వాలెట్ల నుంచి విదేశీ లావాదేవీలు
- నిందితుడి ఖాతాలోని రూ.3.5 కోట్లు ఫ్రీజ్

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన పైరసీ వెబ్‌సైట్ 'ఐబొమ్మ' కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగడం పెద్ద మలుపుగా మారింది. ఈ కేసులో భారీ స్థాయిలో ఆర్థిక అవకతవకలు మరియు మనీలాండరింగ్ (డబ్బు అక్రమ తరలింపు) జరిగినట్లు ఈడీ అధికారులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఈ అనుమానాల నేపథ్యంలో, ఈ కేసును లోతుగా దర్యాప్తు చేసేందుకు ఈడీ సమాయత్తమవుతోంది. పైరసీ వెనుక జరిగిన ఆర్థిక లావాదేవీలు, బెట్టింగ్ యాప్‌ల ద్వారా నిధుల సమీకరణ వంటి అంశాలపై ఇప్పుడు ఈడీ దృష్టి కేంద్రీకృతం కానుంది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు, ఎఫ్‌ఐఆర్, మరియు దర్యాప్తు నివేదికలను తమకు అందించాలని కోరుతూ ఈడీ అధికారులు ఇప్పటికే హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు అధికారికంగా లేఖ రాశారు. పోలీసుల నుంచి వివరాలు అందిన వెంటనే ఈడీ అధికారులు మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద తమ విచారణను అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈడీ దర్యాప్తుతో నిందితుడు ఇమ్మడి రవికి విదేశీ నిధుల ప్రవాహం, అక్రమ హవాలా లావాదేవీలతో సంబంధం ఉందా అనే కోణంలో లోతుగా పరిశోధన జరగనుంది. ఐబొమ్మ వెబ్‌సైట్ నిర్వహణ ద్వారా ఇమ్మడి రవికి బెట్టింగ్ యాప్‌ల ప్రకటనల రూపంలో భారీగా నిధులు అందినట్లు గతంలో పోలీసుల దర్యాప్తులో స్పష్టమైంది. అంతేకాకుండా, ఈ నిధుల మూలాలను మరింత లోతుగా పరిశోధించగా, ఒక క్రిప్టో వాలెట్ నుంచి రవికి చెందిన ఎన్నారై ఖాతాకు ప్రతి నెలా సుమారు రూ.15 లక్షలు బదిలీ అయినట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రిప్టో, ఎన్నారై ఖాతాల లావాదేవీలు విదేశీ నిధుల ప్రవాహానికి మరియు అక్రమ నగదు బదిలీకి సూచనగా ఉండటంతో, ఈడీ దీనిపై తీవ్రంగా దృష్టి సారించింది. ఇప్పటికే పోలీసులు చట్టపరమైన ప్రక్రియల ద్వారా నిందితుడు ఇమ్మడి రవికి చెందిన వివిధ బ్యాంకు ఖాతాల్లో ఉన్న సుమారు రూ.3.5 కోట్లను ఫ్రీజ్ చేశారు. ఈ మొత్తం నిధులు అక్రమ మార్గాల ద్వారా వచ్చినవిగా పోలీసులు భావిస్తున్నారు. ఇప్పుడు ఈడీ రంగంలోకి దిగడం వలన, నిందితుడి బ్యాంకు ఖాతాల నిర్వహణ, ఆ నిధుల మూలాలు, వాటి మళ్లింపుపై పూర్తి స్థాయిలో విచారణ జరగనుంది. చట్ట విరుద్ధ కార్యకలాపాల ద్వారా ఆర్జించిన ఆస్తులను జప్తు చేసే అధికారం ఈడీకి ఉండటం వలన, ఈ కేసు మరింత కీలకంగా మారనుంది. మొత్తం మీద, కేవలం పైరసీ కేసుగానే కాకుండా, ఇదొక అంతర్జాతీయ ఆర్థిక నేరాల కోణంలోకి మారే అవకాశం కనిపిస్తోంది. ఐబొమ్మ వెనుక ఉన్న భారీ ఆర్థిక వ్యవస్థ, హవాలా, క్రిప్టో లావాదేవీలు వంటి అంశాలపై ఈడీ దర్యాప్తు కేంద్రంగా ఉంటుంది. ఈ దర్యాప్తు సినీ పరిశ్రమలో పైరసీకి అడ్డుకట్ట వేయడమే కాకుండా, అక్రమ ఆస్తుల నిర్మూలనలోనూ ముఖ్య పాత్ర పోషించనుంది. ఈడీ విచారణ తర్వాత నిందితులపై మరింత కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# నా భార్య, నా అత్త వల్లే ఈరోజు నేను ఇలా అయ్యా

(మొదటి పేజీతరువాయి)

పోలీసులకు తెలిపిన వివరాల ప్రకారం, విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీలో సాధారణ డిగ్రీ పూర్తి చేసిన రవి, వెబ్‌డిజైనర్‌గా తన కెరీర్‌ను ప్రారంభించాడు. తల్లిదండ్రులు విడిపోయిన తరువాత కుటుంబ బాధ్యతలన్నీ తన భుజాలపై పడ్డాయని, తన చెల్లిని గత ఏడాదే పెళ్లి చేసిన విషయాన్ని గుర్తుచేశాడు. ప్రేమించి పెళ్లి చేసుకోవడంతో తనపై బాధ్యత మరింత పెరిగిందని, కానీ అదే పెళ్లే తన జీవితంలో ఒత్తిడికి కారణమైందని వాపోయాడు. సంభవించిన ప్రతి సమస్యలో భార్య, అత్త సమాజం మాటల్ని నమ్మి తనను అవమానించారని, తక్కువ జీతం కారణంగా కుటుంబ అవసరాలు తీర్చలేకపోతే మరింతగా అవహేళనలు ఎదుర్కొన్నట్టు తెలిపాడు. "నేను ఇచ్చే డబ్బు సరిపోదు... నేనుండకపోతే బెటర్" అనే మాటలే తనను మానసికంగా ఛిన్నాభిన్నం చేశాయని రవి చెప్పినట్టు పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో 2021 కరోనా రెండో తరంగ సమయంలో తన వెబ్‌డిజైన్ నైపుణ్యంతో ఐ బొమ్మ వెబ్‌సైట్‌ను ప్రారంభించినట్టు రవి ఒప్పుకున్నాడు. అప్పట్లో విడుదలైన సినిమాల అసలు ప్రింట్లను అప్‌లోడ్ చేయడం వల్ల వెబ్‌సైట్ ఒక్కసారిగా పాపులర్ అయ్యిందని, రోజురోజుకూ ట్రాఫిక్ పెరిగి తనకు భారీ ఆదాయం వచ్చిందని వివరించాడు. బెట్టింగ్ యాప్స్, లోన్ యాప్స్ ప్రకటనల ద్వారా వచ్చిన మొదటి సంపాదన ₹75 లక్షలు అని చెప్పాడు.

అయితే ఈ సంపాదనను కూడా భార్య-అత్త నమ్మలేదని, తనను వదిలించుకోవాలని వారి మనసులో ముందే నిర్ణయం తీసుకున్నట్టు అనిపించిందని పేర్కొన్నాడు. "ఇవరూ నన్ను



ఒప్పుకోనప్పుడు, డబ్బు తప్ప ఇంకేదీ నన్ను కాపాడదని అప్పుడు అర్థమైంది" అని పోలీసులకు తెలిపినట్టు తెలుస్తోంది. "ఈరోజు మీకు దొరికిపోవడానికి కూడా కారణం వాళ్లే" అనే రవి వ్యాఖ్యలు విచారణలో కలకలం రేపాయి. పోలీసులు రవిని మరింతగా విచారిస్తూ పైరసీ నెట్‌వర్క్, ఆదాయం మార్గాలు, ఇతర సంబంధిత వ్యక్తుల పై మరిన్ని వివరాలు సేకరిస్తున్నారు.



## గుణాత్మక విద్య సాధనపై ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

◆ మండల విద్యాశాఖ అధికారి ఎ.శ్రీనివాస్

**హసన్ పర్తి, నవంబర్ 18(తెలంగాణ ముచ్చట్లు):** హసన్ పర్తి మండలంలోని పాఠశాలలలో స్వచ్ఛత, పరిశుభ్రతను మరింతగా బలోపేతం చేయడంతో పాటు గుణాత్మక విద్య సాధనపై ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మండల విద్యాశాఖ అధికారి ఎ.శ్రీనివాస్ సూచించారు.హసన్ పర్తి మండల ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి ప్రధానోపాధ్యాయుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ మండలంలోని ప్రతి పాఠశాలలో శుభ్రత,పరిశుభ్రత,ఆరోగ్యకరమైన వాతావరణాన్ని పెంపొందించాల్సిన అవసరాన్ని ప్రధానోపాధ్యాయులు గుర్తించాలని అన్నారు.సిలబస్‌ను నిర్ణీత కాలంలో పూర్తిచేయాలని,విద్యార్థులకు గుణాత్మక విద్య అందించేందుకు కృషి చేయాలన్నారు.ఇటీవల నిర్వహించిన సమ్మేటివ్ పరీక్షల ఫలితాలపై సమగ్ర సమీక్ష చేపట్టినట్టు తెలిపారు.ఈ నెల 25 నుండి 30లోపల అన్ని పాఠశాలల్లో మిడ్లెన్ టెస్ట్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కోరారు.విద్యార్థుల ప్రగతి కోసం ప్రధానోపాధ్యాయులు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పుల్ల సంపత్, రమాదేవి,రవీందర్,పీఎం శ్రీ బాలికల ఉన్నత పాఠశాల సుమాదేవి ,ఎమ్మార్సీ సిబ్బంది,పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



## ప్రమాదకర స్థితిలో పీచర,కన్నారం రహదారి

**వేలేరు,నవంబర్18(తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం పీచర శివారు వేములపల్లె నుండి కన్నారం వరకు వెళ్లే రహదారి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. నిర్మాణ పనుల్లో భాగంగా కాంట్రాక్టర్ కేవలం కంకర పోసి పనిని అర్థాంతరంగా ఆపివేయడంతో ఈ రహదారి మరింత ప్రమాదకర స్థితికి చేరుకుంది. దూరం నుండి చూస్తే రహదారి ఉందో లేదో తెలియని స్థాయికి దెబ్బతింది.

రోజూ ఈ మార్గంలో ఆటోలు, బైక్‌లు, ట్రాక్టర్లు ప్రయాణించే వాహనదారులు ఒక్కో అడుగు భయంతో ముందుకు సాగాల్సి వస్తోంది. అసమానంగా పోసిన కంకర, గుంతలు, లోతైన అండ్‌గట్టలు కారణంగా వాహనాలు జారిపడే ప్రమాదం ఎప్పటికప్పుడు ఉందని వారు చెప్తున్నారు. ముఖ్యంగా రాత్రివేళ ఈ రహదారి పై ప్రయాణం పూర్తిగా ప్రాణపాయం అవుతోందని స్థానికులు వేదన వ్యక్తం చేస్తున్నారు.

"కట్టడమే మొదలుపెట్టి వదిలేశారు... ప్రాణాలు పణంగా పెట్టి వెళ్లాల్సిన పరిస్థితి. కానీ అవసరాల కోసం ఈ మార్గం తప్ప మరో దారి లేదు" అని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తక్షణం రహదారి పరిస్థితిని సమీక్షించి, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని పనులను త్వరగా పూర్తి చేయాలని, ప్రజల ప్రాణాలకు హాని కలగకుండా రక్షణాత్మక చర్యలు చేపట్టాలని స్థానికులు మండల అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రతి రోజూ వందలాది మంది ఈ మార్గంలో ప్రయాణించే విషయాన్ని అధికారులు గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి

**కాజీపేట్ నవంబర్ 18( తెలంగాణ ముచ్చట్లు):** కాజీపేట్ టౌన్ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు పట్టాలపై ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. అతని వయసు సుమారు 55 నుండి 60 సంవత్సరాల మధ్య గల వ్యక్తి మంగళవారం ఉదయం ఏడు గంటల ముందు సమయంలో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఎవరైనా వ్యక్తికి సంబంధించిన వారు ఉంటే కాజీపేట లోని జి ఆర్ పి పోలీసుల ఫోన్ నెంబర్లుకు 9849198382, 9948 348 070 సమాచారం ఇవ్వవలసిందిగా పోలీసులు కోరారు.







## నషాముక్త భారత్ అభియాన్ అవగాహన సదస్సు.!

◆ సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో పలు కార్యక్రమాలు.

**సత్తుపల్లి, నవంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** మండల పరిధిలోని బి.గంగారం గ్రామం సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో నషాముక్త భారత్ అభియాన్-5 సంవత్సరాల ప్రయోజనార్థం మాదకద్రవ్యాల దుర్వినియోగం నివారణపై అవగాహన సదస్సు మంగళవారం జరిగింది. మొదటి సంవత్సరం అన్నీ ఇంజనీరింగ్ శాఖల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్మెంట్ సర్వీసెస్-కళాశాల జాతీయ సేవా పథకం సంయుక్తంగా నిర్వహించాయి. కార్యక్రమ వివరాలను జాతీయ సేవా పథకం కార్యక్రమాధికారి బలుసుపాటి సీతారాములు వెల్లడించారు. కార్యక్రమంలో దాసరి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు యువత శారీరక-మానసిక ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపి, గుండె, కాలేయం, ఊపిరితిత్తుల సమస్యలకు దారి తీస్తాయని తెలిపారు. గుర్తుంచుకునే శక్తి తగ్గిపోవడం, ఆలోచనా బలహీనత, విద్య-ఉద్యోగ భవిష్యత్తు దెబ్బతినడం వంటి ప్రమాదాలను హెచ్చరించారు. ఫ్యాషన్, స్నేహితుల ఒత్తిడి, మానసిక ఒత్తిడి కారణంగా యువత వీటికి ఆకర్షితులవుతున్నారని చెప్పారు. "ఎవరైనా మత్తు పదార్థం ఇచ్చినా ధైర్యంగా నో చెప్పాలి. స్నేహితులను తప్పుదారిలోనుంచి కాపాడటం ప్రతి విద్యార్థి బాధ్యత" అని పిలుపునిచ్చారు. క్రీడలు, యోగా, జ్ఞానం, సంగీతం, పుస్తకాలు, సేవా కార్యక్రమాలు ఆరోగ్యకరమైన జీవనశైలికి దోహదం చేస్తాయని పేర్కొన్నారు. ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్మెంట్ సర్వీసెస్ సూపర్వైజర్లు ఇ.గంగాజలం, వి.సుజాత, ఆర్.రజనీ, ఎన్.రమాదేవి మాట్లాడుతూ, మాదకద్రవ్యాల ముప్పు తగ్గించడంలో విద్యార్థుల భాగస్వామ్యం అత్యవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేశారు.

మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ-2025:
"మాదకద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతాను. డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తాను. నాతోపాటు ఎవ్వరూ డ్రగ్స్ బారిన పడకుండా కృషి చేస్తాను. డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు, అక్రమ రవాణా వివరాలను సంబంధిత అధికారులకు తెలియజేస్తాను. తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న డ్రగ్స్ రహిత సమాజ సంకల్పంలో భాగస్వామిని అవుతాను."కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది ప్రసాద్, విజయ్ పాల్గొన్నారు.సైన్స్-హ్యుమానిటీస్ విభాగాధిపతి షేక్ మీరాసాహెబ్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వాడకం చట్టరీత్యా నేరమని, ఇతరులను వాడమని ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లోపంతో విద్యార్థులు స్నేహితుల ప్రభావానికి లోనై మాదకద్రవ్యాల వైపు మొగ్గుచూపుతున్నారని, ఇది వారి భవిష్యత్తుతోపాటు కుటుంబాన్ని విచ్ఛిన్నం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దాసరి ప్రభాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ వూటుకూరి శేషారత్నకుమారి, విభాగాధిపతులు, జాతీయ సేవా పథకం కార్యక్రమాధికారి బలుసుపాటి సీతారాములు, అధ్యాపకులు, నాన్-టీచింగ్ సిబ్బంది, విద్యార్థిని-విద్యార్థులు పాల్గొన్నారు.





## మద్యం సేవించి వాహనం నడపితే కఠిన చర్యలు

◆ ఎల్కతుర్తిలో పోలీసుల ముమ్మర తనిఖీలు ఏఎస్ఐ ఉబేదుల్లా

**ఎల్కతుర్తి,నవంబర్18(తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనం నడపడంతో పాటు వాహన పత్రాల తనిఖీలను పోలీసులు విస్తృతంగా నిర్వహించారు. స్థానిక ఎస్ఐ అక్కినపల్లి ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు ఏఎస్ఐ ఉబేదుల్లా ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో పత్రాలు లేని వాహనాలను ఆపి జరిమానాలు విధించారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ ట్రాఫిక్ నియమాలు కచ్చితంగా పాటించాలని వాహనదారులకు పోలీసులు సూచించారు. ఏఎస్ఐ ఉబేదుల్లా మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు ఆర్‌సి, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ వంటి పత్రాలను తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని తెలిపారు. ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం తప్పనిసరి అవుతుందని, వేగాన్ని నియంత్రణలో ఉంచాలని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం పూర్తిగా నిషేధమని, రాష్ డ్రైవింగ్ మరియు ట్రిపుల్ రైడింగ్ వంటి ఉల్లంఘనలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు.అత్యవసర పరిస్థితులు, ప్రమాదాలు గమనించిన వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఏఎస్ఐ ఉబేదుల్లా పిలుపునిచ్చారు.



## కమ్యూనిస్టు పార్టీ శతజయంతి మహాసభను విజయవంతం చేయాలి

◆ సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు

**ఎల్కతుర్తి,నవంబర్18(తెలంగాణ ముచ్చట్లు):** భారత కమ్యూనిస్టు పార్టీ శతజయంతి ఉత్సవాల సందర్భంలో ఎల్కతుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ, కమ్యూనిస్టు పార్టీ శతాబ్దం పాటు సామాజిక న్యాయం, భూమి, అరణ్యం, నీరు వంటి ప్రజా వనరుల పరిరక్షణ కోసం నిరంతర పోరాటం సాగించిందని పేర్కొన్నారు. కార్మికులు, రైతులు, దళితులు, ఆదివాసులు, గిరిజనులు ఎదుర్కొంటున్న అన్యాయాలపై పార్టీ ఎల్లప్పుడూ ముందుండి పోరాడిందని వివరించారు. "దున్నేవారికి భూమి పనిచేసేవారికి హక్కులు" అనే పార్టీ నినాదం సామాన్య ప్రజల జీవితాల్లో పెద్ద మార్పులను తీసుకువచ్చిందని ఆయన తెలిపారు. ప్రజాస్వామ్య హక్కులు సంకుచితమవుతున్న ఈ పరిస్థితుల్లో జీవించే హక్కు, మాట్లాడే హక్కు కోసం ప్రజలు మళ్లీ ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని సూచించారు.



కమ్యూనిస్టు పార్టీ శతజయంతి ఉత్సవాలు ప్రజా పోరాటాల చరిత్రను కొత్త తరాలకు చేరువ చేయడంలో కీలకంగా మారుతున్నాయని తెలిపారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరగనున్న శతజయంతి మహాసభకు తెలంగాణ ప్రాంతాల ప్రజలు, ముఖ్యంగా దళితులు, గిరిజనులు, ఆదివాసులు, కార్మికులు, యువత పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. భూమి, అరణ్యం, నీరు, ఉపాధి, స్వాభిమాన హక్కుల కోసం సాగిన పోరాటాల స్ఫూర్తిని ఈ మహాసభ మరోసారి ప్రజల్లో నింపుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చాడ వెంకటరెడ్డి, కలవేని శంకర్, మారుపాక అనిల్‌కుమార్, మణికంఠ రెడ్డి, పల్లె నరసింహ, కన్నం లక్ష్మీనారాయణ, నేదునూరి జ్యోతి, కర్రె బిక్షపతి, ఆదర్ శ్రీనివాస్, మంద సదాలక్ష్మి, మధ్యల ఎల్లేష్, తోట బిక్షపతి, స్థిరబోయిన కరుణాకర్, ఊట్కూరి రాములు, కర్రే లక్ష్మణ్, మర్రి శ్రీనివాస్, కామెర వెంకటరమణ, శనిగరపు రాజ్‌కుమార్, మరి విజయ్, గడ్డం రాజనర్స్, నకిర్తి ఓదెలు, జక్కు రాజు, నిమ్మల మనోహర్, తండ మొండయ్య, బొంత మల్లయ్య, వేముల కృష్ణ, తులసి, రాంమోహన్ రెడ్డి, గడ్డం లలిత, తిరుమల పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక



# టాక్స్ రిఫండ్ ఆలస్యమైందా..

## ప్రభుత్వం మీకు వడ్డీ చెల్లిస్తుంది తెలుసా?

ప్రతి ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత.. ఆ సంవత్సరంలో నిర్దిష్ట ఆదాయ పరిమితి దాటితే దానిపై పన్ను చెల్లించాల్సి వస్తుంది. ఇక్కడ మీరు చెల్లించాల్సిన అసలు పన్ను కంటే ఎక్కువ మొత్తం ప్రభుత్వానికి చెల్లించినప్పుడు.. ఆ అదనపు మొత్తాన్ని తిరిగి పొందొచ్చు. దీనిని ఇన్‌కం టాక్స్ రిఫండ్ (పన్ను వాపసు) అంటారు. చివరికి పన్ను లెక్కల ద్వారా మినహాయింపులు, తగ్గింపులు అన్నీ చూసి.. మీరు ఎక్కువ చెల్లించినట్లు గుర్తిస్తే.. రిఫండ్ జారీ చేస్తుంది ఆదాయపు పన్ను శాఖ. సాధారణంగా ఐటీ రిటర్న్స్ ఫైల్ చేసిన తర్వాత 30 రోజుల్లోపు ఇ వెరిఫికేషన్ పూర్తి చేయాలి. ధ్రువీకరణ పూర్తయ్యాక.. ఆదాయపు పన్ను శాఖ మీ ఐటీఆర్‌ను ప్రాసెస్ చేసేందుకు 2045 రోజుల వరకు సమయం పడుతుంది. ప్రాసెస్ పూర్తయ్యాక.. 210 రోజుల్లో బ్యాంక్ అకౌంట్లో క్రెడిట్ అవుతుంది. అంటే మొత్తంగా రోజుల నుంచి నెలల్లోగా టాక్స్ రిఫండ్ వస్తుంది.కొందరికి టాక్స్ రిఫండ్ తొందరగానే పడుతుంటుంది. ఇంకొందరికి నెలలు గడుస్తున్నా పన్ను వాపసు రానేరాదు. అయితే ఐటీఆర్ ఫైల్ చేసి ఇంకా రిఫండ్ కోసం ఎదురుచూస్తున్నట్లయితే.. ఆందోళన చెందాల్సిన పని లేదు. టాక్స్ పేయర్ తప్పులేకుండా రిఫండ్ ఆలస్యమైతే.. ప్రభుత్వం అప్పుడు మీకు రిఫండ్ మాత్రమే కాకుండా దానిపై వడ్డీ కూడా చెల్లించాల్సి ఉంటుంది.ఆదాయపు పన్ను చట్టం ప్రకారం.. సెక్షన్ 244A ప్రకారం ఆలస్యమైనటువంటి రిఫండ్ మొత్తంపై పన్ను శాఖ.. నెలకు 0.5 శాతం చొప్పున సాధారణ వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ఇది సంవత్సరానికి 6 శాతంగా ఉంటుంది. ప్రస్తుత ఐటీఆర్ గడువు తేదీ 2025 సెప్టెంబర్ 16తో చూస్తే.. ఆలోపు ఐటీఆర్ ఫైల్ చేసి ఉంటే.. వడ్డీ లెక్కించే కాలం ఏప్రిల్ 1 నుంచి రిఫండ్ చెల్లించే తేదీ వరకు ఉంటుంది. గడువు దాటిన తర్వాత ఐటీఆర్ ఫైల్ చేస్తే అప్పుడు ఐటీఆర్ ఫైల్ చేసినప్పటి నుంచి రిఫండ్ చెల్లించే వరకు వడ్డీని లెక్కిస్తారు.ఇక్కడ మీరు టీడీఎస్ లేదా అడ్వాన్స్ టాక్స్ లేదా సెల్ఫ్ అసెస్మెంట్ టాక్స్ ద్వారా అధిక పన్ను చెల్లించినప్పుడు.. మీ తరఫున ఎలాంటి పొరపాటు లేనప్పుడు వడ్డీ పొందేందుకు అర్హత సాధిస్తారు. అదే ఆలస్యం అనేది పన్ను చెల్లింపుదారుడి పొరపాటుతో జరిగినట్లయితే వడ్డీ రాదు. ఇక్కడ అసంపూర్తి సమాచారం ఇవ్వడం, తప్పుడు వివరాలు, తప్పుడు బ్యాంక్ అకౌంట్ డీటెయిల్స్ ఇవ్వడం సహా నోటీసులకు నిర్దిష్ట సమయంలో స్పందించకపోవడం వంటివి టాక్స్ పేయర్ పొరపాట్ల కిందికి వస్తాయి. మీ రిఫండ్ మొత్తం రూ. 100 కంటే తక్కువగా ఉంటే కూడా వడ్డీ రాదు. రిఫండ్ ఆలస్యం అయ్యేందుకు కారణాలివే..ఐటీఆర్ ఫైల్ చేశాక.. రిఫండ్ లేట్ అయ్యేందుకు చాలానే కారణాలు ఉంటాయి. ఇక్కడ ముందుగా డేటా సరిపోలకపోవడం గురించి మాట్లాడుకోవాలి. ఫారం 26AS, AIS లేదా TIS లో పొందుపర్చిన ఆదాయ వివరాలకు, ఐటీఆర్ వివరాలకు తేడా ఉండటం.. టీడీఎస్/టీసీఎస్ క్రెడిట్ సరిపోలకపోవడం వల్ల ఆలస్యం అవ్వొచ్చు.ఇన్‌కంటాక్స్ ఇ ఫైలింగ్ పోర్టల్‌లో బ్యాంక్ అకౌంట్‌ను ముందుగా ధ్రువీకరించకపోవడం వల్లమీ పాన్ కార్డును.. ఆధార్ కార్డుతో లింక్ చేయకపోవడం వల్ల పాన్ కార్డు ఇనాపరేటివ్ అవుతుంది. అప్పుడు కూడా రిఫండ్ నిలిచిపోతుంది.ఐటీఆర్ ఫైల్ చేసిన 30 రోజుల్లోపు ధ్రువీకరించకపోతే (ఇ వెరిఫై) రిటర్న్ చెల్లదు.క్యాపిటల్ గెయిన్స్ టాక్స్, విదేశీ ఆదాయం, ఇతర ఆదాయ వనరులు ఎక్కువగా ఉంటే వీటిపై నిశితంగా దృష్టి సారించడం వల్ల ఆలస్యం అవుతుంది.మునుపటి సంవత్సరాల నుంచి పెండింగ్‌లో టాక్స్ డిమాండ్స్ ఉంటే రిఫండ్ ఆగిపోతుంది.

# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఆరు రోజుల లాభాల తర్వాత నష్టాల్లో ముగిశాయి. గ్లోబల్ మార్కెట్‌లో ప్రతికూల పవనాలతో మార్కెట్లు ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. అమ్మకాలతో అస్థిరతకు గురయ్యాయి. దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం 85,042.37 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో మొదలయ్యాయి. ఇంట్రాడేలో 85,042.41పాయింట్ల వద్ద గరిష్టాన్ని తాకిన సెన్సెక్స్.. 84,558.36 పాయింట్ల కనిష్టానికి చేరుకుంది. చివరకు 277.93 పాయింట్ల నష్టంతో 84,673.02 వద్ద స్థిరపడింది.నిఫ్టీ సైతం 103.40 పాయింట్లు తగ్గి 25,910.05 వద్ద ముగిసింది. నిఫ్టీ స్మాల్ క్యాప్ ఇండెక్స్ ఒకశాతం తగ్గింది. అయితే, నిఫ్టీ మిడ్‌క్యాప్ 61,220.25 పాయింట్ల సరికొత్త రికార్డు గరిష్ట స్థాయిని తాకిన తర్వాత 0.6 శాతం దిగువన ముగిసింది. నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ ఇంట్రాడేలో 59,103.65 తాజా గరిష్ట స్థాయిని తాకిన తర్వాత స్వల్ప నష్టాలతో ముగిసింది. అన్ని రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఐటీ, మెటల్, రియాల్టీ ఒక్కొక్కటి ఒకశాతం తగ్గాయి. నిఫ్టీలో భారతీ ఎయిర్‌టెల్, యాక్సిస్ బ్యాంక్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, బజాజ్ ఆటో, ఏషియన్ పెయింట్స్ ప్రధాన లాభాలను ఆర్జించాయి. టెక్ మహీంద్రా, టాటా కన్స్యూమర్, జియో ఫైనాన్షియల్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, బజాజ్ ఫిన్‌సర్వ్ నష్టపోయాయి.



# క్లౌడ్‌ఫ్లేర్ సర్వర్ డౌన్..
# మళ్లీ మొరాయించిన ఎలాన్ మస్క్ 'ఎక్స్'..!

ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ (ట్విట్టర్) మళ్లీ మొరాయిస్తున్నది. సాయంత్రం 5గంటల భారత్‌లో 'ఎక్స్' పని చేయడం లేదు. డిజిటల్ ప్లాట్‌ఫాట్స్ ట్రాకర్ వెబ్‌సైట్ అయిన డౌన్‌డెటెక్టర్‌లో వేలాది మంది వినియోగదారులు ఫిర్యాదు చేశారు. తమ అకౌంట్స్‌ని యాక్సెస్ చేయలేకపోతున్నామంటూ రిపోర్ట్ చేశారు. 'ఎక్స్' యాప్‌తో పాటు వెబ్‌సైట్‌లో లాగిన్ చేయలేకపోతున్నామని పేర్కొన్నారు. పలువురు ఇంటర్నల్ సర్వర్ ఎర్రర్ సందేశం వస్తున్నట్లుగా తెలిపారు. భారత్‌తో పాటు అమెరికాలోనూ 'ఎక్స్'ని యాక్సెస్ చేయలేకపోతున్నామంటూ యూజర్లు పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా చాలాచోట్ల ఎక్స్ పని చేయడం లేదని సమాచారం. అయితే, ఎక్స్ పని చేయకపోవడానికి క్లౌడ్‌ఫ్లేర్‌లోని సాంకేతిక సమస్య



కారణంగా సమాచారం.అయితే, దీనిపై ఇప్పటి వరకు 'ఎక్స్' ఎలాంటి ప్రకటన జారీ చేయలేదు. పలువురు యూజర్లు ఇతర సోషల్ మీడియా వేదికగా ఎక్స్‌తో పాటు పలువురు వెబ్‌సైట్స్ సైతం పని చేయడం లేదని పేర్కొన్నారు. క్లౌడ్‌ఫ్లేర్‌లోని హోస్ట్ సర్వర్ డౌన్ అయ్యిందని ఓ యూజర్ తెలిపాడు. అదే సమయంలో వేలాది మంది డౌన్ డిటెక్టర్‌లోనూ సమస్యలను ఎదుర్కొంటున్నట్లుగా తెలిపారు. ఈ సాంకేతిక లోపం ప్రపంచవ్యాప్తంగా భారీగా కనిపిస్తున్నది. ఎక్స్ మొబైల్ యాప్ నుంచి 61 శాతం మంది ఫిర్యాదు చేయగా.. వెబ్‌సైట్ పని చేయడం లేదని 28శాతం, సర్వర్ కనెక్షన్ లోపాలు తలెత్తినట్లుగా 11శాతంగా మంది ఫిర్యాదు చేసినట్లుగా డేటా పేర్కొంది. అయితే, దీనిపై క్లౌడ్‌ఫ్లేర్ స్పందించింది. క్లౌడ్‌ఫ్లేర్ సిస్టమ్స్‌లో సాంకేతిక సమస్య తలెత్తిందని.. సమస్యను గురించి వేగంగా పరిష్కరిస్తామని పేర్కొంది. అయితే, గత కొంతకాలంగా ఎక్స్ మొరాయిస్తూ వస్తున్నది. తరుచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. దాంతో యూజర్లు ఇబ్బందిపడుతున్నారు.

# కాగ్నిజెంట్‌లో ఉద్యోగులపై నిఘా!

ఉద్యోగుల పనితీరును అంచనా వేసేందుకు సాఫ్ట్‌వేర్ కంపెనీ కాగ్నిజెంట్ కఠినమైన విధానాన్ని తీసుకొస్తున్నట్టు వార్తలు వెలువడుతున్నాయి. ఉద్యోగుల ల్యాప్‌టాప్ లేదా కంప్యూటర్ మానిటర్ ఐదు నిమిషాలు ఆగినా.. ఎలాంటి యాక్టివిటీ లేకున్నా.. దానిని 'ఐడిల్'గా మార్కింగ్ చేస్తున్నట్టు తెలిసింది. ఇందుకోసం గాను కంపెనీ 'ప్రోహాన్స్' అనే టూల్‌ను వినియోగించేందుకు సిద్ధమవుతుందట.కాగ్నిజెంట్ ఇప్పుడు ఉద్యోగుల కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకోసం ఈ పర్యవేక్షణ వ్యవస్థను తీసుకువచ్చింది.కంపెనీ జారీ చేసిన ల్యాప్‌టాప్‌లు, పీసీల ద్వారా ఉద్యోగుల పనితీరును ట్రాక్ చేస్తోంది. ఇందుకోసం 'ప్రోహాన్స్' వంటి వర్క్ ఫోర్స్ మేనేజ్‌మెంట్ సాధనాలను వి




నియోగిస్తోంది. ఉద్యోగులు ఉపయోగించే కీబోర్డు, మౌస్‌ల ద్వారా ట్రాక్ చేస్తోంది. ఈ తరహా ట్రాకింగ్‌పై విమర్శలు వస్తున్నాయి. 5 నిమిషాల కంటే ఎక్కువసేపు ఉద్యోగి పని చేయకుండా ఖాళీగా ఉన్న సమయాన్ని ప్రోహాన్స్ వంటి టూల్ ట్రాక్ చేస్తుంది. మౌస్ లేదా కీబోర్డు 5 నిమిషాల కంటే ఎక్కువసేపు ఇన్‌యాక్టివ్‌గా ఉంటే ఆ ఉద్యోగి ఖాళీగా ఉన్నట్లు పరిగణిస్తారు. అదే 15 నిమిషాల కంటే ఎక్కువసేపు ఇన్‌యాక్టివ్‌గా ఉంటే వేరే పనిలో నిమగ్నమైనట్లు పరిగణిస్తారు.

ఈ మానిటరింగ్ వ్యవస్థ ఒక్కో టీమ్‌కు ఒక్కో విధంగా ఉంటుందని కథనాలు వెలువడ్డాయి.ఈ ట్రాకింగ్ వ్యవస్థపై విమర్శలు వస్తుండటంతో కంపెనీ స్పందించింది. ఈ ట్రాకింగ్‌ను ఉద్యోగి పనితీరుకు ముడిపెట్టబోమని స్పష్టం చేసింది. ప్రమోషన్లు, బోనస్ వంటి అంశాల్లో ఈ డేటాను ఉపయోగించబోమని వెల్లడించింది. ఇతర సంస్థల మాదిరిగానే ఉత్పాదకతను పెంచే టూల్స్‌ను మాత్రమే ఉపయోగిస్తున్నట్లు తెలిపింది.

# చైనా ఫార్ములాలో..
# యువత 72 గంటలు పనిచేయాలి

## ఇన్ఫీ నారాయణమూర్తి


ఇన్ఫోసిస్ ఫౌండర్ ఎన్ఆర్ నారాయణ మూర్తి మరోసారి హెడ్‌లైన్స్‌లో నిలిచారు. ప్రపంచ స్థాయిలో ఇతర దేశాలతో భారత్ పోటీ పడాలంటే యువతరం వారానికి 70 గంటలు పని చేయాలని ఆయన చేసిన వ్యాఖ్యలు పెద్ద ఎత్తున చర్చకు దారి తీసిన విషయం తెలిసిందే. అయితే, తాజాగా ఆయన మరోసారి అలాంటి వ్యాఖ్యలే చేశారు. మన దేశం వేగంగా అభివృద్ధి చెందాలంటే యువత వారానికి 72 గంటలు పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా చైనాలో ప్రసిద్ధి చెందిన 996 రూల్‌ను ఉదాహరణగా చెప్పారు.ఓ టీవీ ఛానెల్‌తో మాట్లాడిన మూర్తి.. చైనా ఆర్థిక వ్యవస్థను ఎదుర్కోవాలంటే యువత మరింత కష్టపడి పనిచేయాలన్నారు. 'చైనాలో 996 అనే పాలసీ ఉంది. దాని అర్థం ఏంటో తెలుసా..? ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ వారానికి 6



రోజులు పనిచేయడం. మొత్తం 72 గంటలు పనిచేయడం' అని అన్నారు. భారతీయ యువత ఈ పనిగంటలను అనుసరించాలని వ్యాఖ్యానించారు. ముందు యువత తమ కెరీర్ నిర్మించుకోవడంపై దృష్టిపెట్టాలని తర్వాతే వర్క్‌లైఫ్ బ్యాలెన్స్ గురించి ఆలోచించాలని సూచించారు. ప్రస్తుతం ఆయన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి.కాగా, ఆర్థిక వ్యవస్థ ఉరకలెత్తేందుకు, ఉత్పాదకత పెరిగి మనం అగ్ర దేశాలతో పోటీ పడాలంటే యువతరం వారానికి 70 గంటలు పని చేయయాలని ఇన్ఫోసిస్ ఫౌండర్ ఎన్ఆర్ నారాయణ మూర్తి వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. 'ప్రపంచంలోకెల్లా భారత్‌లోనే ఉత్పాదకత అతి తక్కువ. ఉత్పత్తిలో మన పని మెరుగు పర్చుకోలేకపోయినా, ప్రభుత్వంలో కొంత స్థాయి వరకూ అవినీతి తగ్గించకపోయినా.. అద్భుతమైన ప్రగతి సాధించిన దేశాలతో మనం పోటీ పడలేం' అని నారాయణ మూర్తి స్పష్టం చేశారు. 'నా యువతరానికి నేను చేసే రిక్వెస్ట్ ఒకటే.. 'ఇది నా దేశం. నా దేశం కోసం నేను వారానికి 70 గంటలు పని చేస్తాను' అని తప్పనిసరిగా ప్రతిజ్ఞ చేయాలి` అని నారాయణ మూర్తి చెప్పారు. అయితే, ఆయన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఇంత సుదీర్ఘ గంటలు పనిచేస్తే మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపడంతో పాటు పనిజీవితం మధ్య సమతూకం దెబ్బతింటుందనే విమర్శలు వెల్లువెత్తాయి.

# ఎంట్రీతోనే అదరగొట్టిన ఫిజిక్స్‌వాలా..
# 33 శాతం ప్రీమియంతో లిస్టింగ్..

ప్రముఖ ఎడ్‌టెక్ యూనికార్న్ సంస్థ ఫిజిక్స్ వాలా ఐపీఓ అదరగొట్టింది. ఈ కంపెనీ షేర్లు మంగళవారం దేశీయ స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయ్యాయి. ఎంట్రీలోనే అదరగొట్టాయి. ఏకంగా 33 శాతం ప్రీమియంతో లిస్టింగ్ అయ్యాయి. ఈ ఐపీఓ ధర రూ. 109తో పోలిస్తే జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజీ ఎన్ఎస్ఈలో ఈ స్టాక్ రూ. 145 వద్ద ట్రేడింగ్ మొదలు పెట్టింది. ఇక బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ బీఎస్ఈలో రూ. 143.10 వద్ద లిస్టింగ్ అయింది. ఎంట్రీతోనే తమ ఇన్వెస్టర్లకు కాసుల వర్షం కురిపించింది. ఆ తర్వాత కూడా రాణిస్తోంది. మరి ఈ ఐపీఓ ప్రైస్ బ్యాండ్, లిస్టింగ్ సహా పూర్తి వివరాలు తెలుసుకుందాం.ఫిజిక్స్‌వాలా ఐపీఓకు బిడ్డింగ్ తొలి రోజున ఆదరణ అంతంత మాత్రంగానే ఉంది. అయితే చివరి రోజు మాత్రం ఇన్వెస్టర్ల నుంచి అనూహ్య స్పందన కనిపించింది. ఈ పబ్లిక్ ఇష్యూలో భాగంగా 18,62,04,143 షేర్లు ఆఫర్ చేశారు. అయితే, ఏకంగా 33,62,27,044 షేర్లకు బిడ్లు వచ్చాయి. రూ. 3480 కోట్లు సమీకరించే లక్ష్యంతో ఈ పబ్లిక్ ఇష్యూ వచ్చింది.




ఇందులో ఒక్కో షేరుకు ప్రైస్ బ్యాండ్ రూ. 103 109గా నిర్ణయించారు. ఈ ఐపీఓలో రూ. 3100 కోట్లు విలువైన ఫ్రెష్ షేర్లు జారీ చేయగా రూ. 380 కోట్లు విలువైన ఆఫర్ ఫర్ సేల్ ద్వారా ప్రమోటర్లు తమ వాటాను విక్రయించారు.దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాల్లో ట్రేడవుతున్నాయి. వరుస లాభాలకు బ్రేక్ పడింది. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపిన క్రమంలో వరుస లాభాలకు కళ్లెం పడినట్లయింది. మధ్యాహ్నం 1 గంటల సమయంలో సెన్సెక్స్ 177 పాయింట్ల నష్టంతో 84,773 పాయింట్ల వద్ద ట్రేడవుతోంది. ఇక నిఫ్టీ 50 ఇండెక్స్ 70 పాయింట్లు కోల్పోయి 25,943 పాయింట్ల వద్ద కొనసాగుతోంది. నిఫ్టీ బ్యాంక్ సూచీ మాత్రం 22 పాయింట్ల లాభంతో 58,985 పాయింట్ల వద్ద ట్రేడవుతోంది. ఇక నిఫ్టీ మిడ్ క్యాప్ 100 ఇండెక్స్ 260 పాయింట్ల మేర కోల్పోయింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాల ప్రభావం దేశీయ మార్కెట్ సూచీలపై స్పష్టంగా కనిపించింది. సోమవారం అమెరికా మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. ఆసియా మార్కెట్లలోనూ మిశ్రమ ఫలితాలు ఉన్నాయి. దీంతో దేశీయంగా మదుపరులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. దీంతో కీలక రంగాల్లోని దిగ్గజ కంపెనీల షేర్లు అమ్మకాల ఒత్తిడికి గురవుతున్నాయి.

TELANGANA MUCHATLU
తెలంగాణ ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక


# బూత్ స్థాయి నిర్మాణంపై దృష్టి

(మొదటి పేజీతరువాయి)

విస్తరించే అంశాలపై ఈ సమావేశంలో విస్తృత చర్చ జరిగింది. సమావేశం అనంతరం రాంచందర్ రావు మాట్లాడుతూ టీఎస్ బీజేపీని గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మరింత బలపర్చే దిశగా అన్ని విభాగాలూ సమన్వయంతో ముందుకు సాగుతున్నాయని తెలిపారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా పార్టీ కార్యాచరణ ప్రణాళికలను సవరించుకోవాలని, బూత్ కమిటీలను శక్తివంతం చేయడం తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. విభిన్న మోర్చాలు చేపట్టే కార్యక్రమాలు, యువత మహిళల భాగస్వామ్యం, సోషల్ మీడియా వ్యూహాలు, తదుపరి నెలల్లో




అమలు చేసే ప్రత్యేక ప్రచార ప్రణాళికలపై నేతలు సమగ్ర చర్చ జరిపారు. ప్రతి నేత, ప్రతి కార్యకర్త ఒకే దిశగా కట్టుబాటుతో పనిచేస్తున్నారని రాంచందర్ రావు పేర్కొన్నారు.

"బలమైన తెలంగాణ బీజేపీ బలమైన భారత్" సూత్రంతో పార్టీ ముందుకు సాగుతుందని, వచ్చే రోజుల్లో ప్రజల్లో మరింత చేరువయ్యే కార్యక్రమాలు చేపట్టనున్నట్టు రాంచందర్ రావు వెల్లడించారు.

# ముంచుకొస్తున్న అల్పపీడనం

- రెండు రాష్ట్రాలకు వాతావరణ హెచ్చరిక
- ఏపీకి వాన గండం.. తెలంగాణలో చలి పంజా
- సింగిల్ డిజిట్‌కు పడిపోయిన ఉష్ణోగ్రతలు



ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం విచిత్రమైన వాతావరణ పరిస్థితి కొనసాగుతోంది. ఒక వైపు చలి తీవ్రత గజగజ వణికిస్తుంటే, మరోవైపు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం కారణంగా పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోందని, దీని ప్రభావంతో మంగళవారం నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ప్రకాశం, అనంతపురం, అన్నమయ్య, సత్యసాయి, కడప, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసి, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మరోవైపు, నవంబర్ 21వ తేదీన బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా మరో నాలుగు రోజుల పాటు ఓ మోస్తారు వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఇప్పటికే మంగళవారం ఉదయం నుంచి తిరుమల, తిరుచానూరులో భారీ వర్షం కురుస్తుండటంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ అల్పపీడన వర్షాల కారణంగా ఏపీలో కొన్ని ప్రాంతాల్లో చలి మరియు వానల మిశ్రమ వాతావరణం నెలకొనే అవకాశం ఉంది.

ఇక తెలంగాణ విషయానికొస్తే, రాష్ట్రంలో చలి పంజా విసురుతోంది. కనిష్ట ఉష్ణోగ్రత రికార్డు స్థాయిలో 7 డిగ్రీలకు పడిపోయింది. భారతదేశం అంతటా చలిగాలులు, వర్షపాతం హెచ్చరికలను జారీ చేసిన ఐఎండీ, నవంబర్ 18 నుంచి 20 తేదీల మధ్య పశ్చిమ మధ్యప్రదేశ్, తూర్పు రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, విదర్భలోని కొన్ని ప్రాంతాలలో తీవ్రమైన చలిగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. సంగారెడ్డి, కొమురంభీం జిల్లా ఆసిఫాబాద్‌లో 7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వికారాబాద్, రంగారెడ్డి, సిరిసిల్ల, కామారెడ్డి, సిద్దిపేట, నిజామాబాద్‌లలో 8 డిగ్రీలు, భూపాలపల్లిలో 9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెలంగాణలోని ఆదిలాబాద్, కొమురంభీం, మంచిర్యాల, నిర్మల్, మెదక్, నిజామాబాద్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో చలిగాలుల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం 'ఎల్లో అలర్ట్' జారీ చేసింది. రాబోయే రెండు రోజుల్లో కనిష్ట ఉష్ణోగ్రత సాధారణం కంటే 4 నుండి 5 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గే అవకాశం ఉందని వెల్లడించింది. దీనికితోడు, ఏపీలోని ఏజెన్సీ ప్రాంతాల్లో కూడా ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోతున్నాయి. అల్లూరి జిల్లా మినుములూరులో అత్యల్పంగా 6 డిగ్రీలు, అరకులో 7.3, పాడేరులో 8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదై, దట్టమైన పొగమంచు కమ్ముకుంది.



ఈ విపరీత వాతావరణ మార్పుల నేపథ్యంలో రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా వృద్ధులు మరియు పిల్లలు చలి నుంచి రక్షణ పొందేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ సూచించింది. ఏపీలో అల్పపీడనం కారణంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు మరియు రైతులు కూడా తగిన ముందు జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. రాబోయే నాలుగు రోజులు వాతావరణ పరిస్థితుల్లో ఎలాంటి మార్పులు సంభవిస్తాయో వేచి చూడాలి.

# ఉచితం కోసం వెళ్లి నష్టపోవద్దు

- పైరసీతో డేటా చోరీ
- తెలంగాణ పోలీసుల కీలక హెచ్చరికలు
- ఉచితం కోసం వెళ్లి నష్టపోవద్దు
- సైబర్ మోసగాళ్ల పట్ల జాగ్రత్త
- మాల్‌వేర్ అటాక్‌తో డేటా చోరీ




పైరసీ వెబ్‌సైట్‌లు, ఉచితంగా కంటెంట్‌ను అందించే అనధికారిక ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగించడం ద్వారా వినియోగదారులు తమ ముఖ్యమైన మరియు వ్యక్తిగత డేటాను కోల్పోయే ప్రమాదం ఉందని తెలంగాణ పోలీసులు ప్రజలను తీవ్రంగా హెచ్చరించారు. పైరసీని ఏ విధంగానూ ప్రోత్సహించవద్దని, ఉచితం కదా అని అలాంటి లింక్‌లు లేదా అప్లికేషన్ల జోలికి వెళ్లవద్దని సూచించారు. మీ అమూల్యమైన డేటాను సైబర్ మోసగాళ్ల చేతిలో పెట్టవద్దని, పైరసీ వెబ్‌సైట్‌లను సందర్శించడం ద్వారా మీ భద్రతకు మీరే ముప్పు తెచ్చుకుంటున్నారని పోలీసులు స్పష్టం చేశారు. ఈ మేరకు తెలంగాణ పోలీసులు ఒక పబ్లిక్ సర్వీస్ ప్రకటనను విడుదల చేశారు. పైరసీ వెబ్‌సైట్‌లను లేదా అప్లికేషన్లను ఉపయోగించే వారికి తెలియకుండానే వారి కంప్యూటర్లు లేదా స్మార్ట్‌ఫోన్లలోకి మాల్‌వేర్ అటాక్ జరిగి డేటా చోరీ అవుతుందని పోలీసులు తెలిపారు. ఈ మాల్‌వేర్ మీ పరికరంలోకి ప్రవేశించిన తర్వాత, మీకు తెలియకుండానే అది మీ వ్యక్తిగత సమాచారం, బ్యాంకింగ్ వివరాలు లేదా ఇతర సున్నితమైన డేటాను సైబర్ నేరగాళ్లకు చేరవేసే అవకాశం ఉందని వారు హెచ్చరించారు. ఈ విధంగా నిబంధనలకు విరుద్ధంగా ఉచిత కంటెంట్ కోసం ప్రయత్నించడం చివరికి భారీ నష్టాన్ని కలిగించే ప్రమాదముందని పోలీసులు వివరించారు. పైరసీ కారణంగా కేవలం ఆర్థిక లేదా వ్యక్తిగత డేటా చోరీ మాత్రమే కాకుండా, మీ ఫోన్లలోని లేదా కంప్యూటర్లలోని వ్యక్తిగత ఫోటోలు మరియు ఫైల్స్ కూడా లీక్ అయ్యే ప్రమాదం ఉందని తెలంగాణ పోలీసులు పౌరులను అప్రమత్తం చేశారు. పైరసీ సైట్‌లలో క్లిక్ చేసే ప్రతి లింక్, డౌన్‌లోడ్ చేసే ప్రతి ఫైల్ వెనుక మాల్‌వేర్ లేదా స్పైవేర్ దాగి ఉండవచ్చు. ఉచితంగా సినిమానో లేదా పాటనో చూసేందుకు వెళ్లి, చివరకు మీ వ్యక్తిగత గోప్యతను, భద్రతను కోల్పోవాల్సి వస్తుందని వారు నొక్కి చెప్పారు.




పోలీసులు ముఖ్యంగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, ఉచితం కోసం వెళ్లి మీ కష్టార్జితాన్ని లేదా మీ వ్యక్తిగత సమాచారాన్ని కోల్పోవద్దని తెలిపారు. పైరసీని అస్సలు ఎంకరేజ్ చేయవద్దని, చట్టబద్ధమైన మరియు అధికారిక ప్లాట్‌ఫారమ్‌ల ద్వారానే కంటెంట్‌ను వినియోగించాలని సూచించారు. పైరసీ వెబ్‌సైట్‌లు చాలా వరకు అక్రమ బెట్టింగ్ యాప్‌లు మరియు ఇతర నేరపూరిత వెంచర్‌లకు సంబంధించిన ప్రకటనలను కలిగి ఉంటాయని, వాటి ద్వారా కూడా వినియోగదారులు మోసపోయే ప్రమాదం ఉందని తెలిపారు.

మొత్తంగా, తెలంగాణ పోలీసులు పైరసీ ద్వారా జరిగే డేటా చోరీ మరియు సైబర్ నేరాల పట్ల ప్రజలను చైతన్యపరచడానికి ఈ హెచ్చరికలు జారీ చేశారు. ప్రతి ఒక్కరూ సైబర్ భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని, పైరసీని ప్రోత్సహించకుండా, బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించాలని కోరారు. ఏవైనా సైబర్ నేరాలు జరిగితే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# ఆర్జేడీ ఆరోపణలను సాంకేతికంగా ఖండించిన ఎన్నికల సంఘం

- ట్యాంపరింగ్ అసాధ్యమని స్పష్టీకరణ
- ఎన్నికల ప్రక్రియ నిబంధనలు వివరణ




బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్‌కు ముందే ఈవీఎంలలో ప్రతి ఓటింగ్ యంత్రంలో 25 వేల ఓట్ల చొప్పున పడ్డాయన్న ఆర్జేడీ సీనియర్ నేత జగదానంద సింగ్ ఆరోపణలపై ఎన్నికల సంఘం తీవ్రంగా స్పందించింది. ఆర్జేడీ నేత ఆరోపణలను ఖండిస్తున్నట్లు తెలిపిన ఎన్నికల సంఘం, ఇది సాంకేతికంగా అసాధ్యమని స్పష్టం చేసింది. ఈ ఆరోపణలు ఎన్నికల ప్రక్రియలో అనుసరించిన నిబంధనల ప్రకారం తప్పుడు ఆరోపణలని పేర్కొంది. ఈవీఎంలకు బ్లూటూత్, ఇంటర్నెట్, ఇతర కనెక్షన్లు ఏవీ ఉండవని గుర్తు చేస్తూ, బయటి నుంచి ఈవీఎంను యాక్సెస్ చేయడం లేదా డిజిటల్ ట్యాంపరింగ్ చేయడం అసాధ్యమని తేల్చి చెప్పింది. బీహార్ ఎన్నికల తీర్పు ప్రజల అభీష్టాన్ని ప్రతిబింబించలేదని, ఈవీఎంలలో అవకతవకలు జరిగినందున న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం ఉందని ఆర్జేడీ సోమవారం పేర్కొంది. పోలింగ్ ప్రారంభానికి ముందే ప్రతి ఈవీఎంలలో 25 వేల ఓట్లు పడ్డాయని, అయినప్పటికీ తమ పార్టీ 25 సీట్లు సాధించిందంటూ జగదానంద సింగ్ ఆరోపణలు గుప్పించారు. ఈ ఆరోపణలపై స్పందించిన ఎన్నికల సంఘం, పోలింగ్‌కు ముందు 25 వేల ఓట్లు ఉండటం అనేది పూర్తిగా అసాధ్యమైన విషయం అని స్పష్టం చేసింది. ఈ ఆరోపణలకు ఎలాంటి ప్రామాణికత లేదని అధికారులు తేల్చారు.

ఎన్నికల సంఘం అధికారులు, తమ ప్రక్రియ పారదర్శకతను తెలియజేస్తూ కొన్ని అంశాలను వివరించారు. పోలింగ్‌కు ముందు ఈవీఎంలలో ప్రతి అభ్యర్థికి సున్నా ఓట్లు కనిపిస్తాయని తెలిపారు. అంతేకాకుండా, పోలింగ్ రోజున పార్టీల ఏజెంట్ల సమక్షంలోనే మాక్ పోలింగ్ నిర్వహిస్తారని, ఆ తర్వాత ఆ మాక్ పోల్ ఓట్లను కూడా తొలగించి, యంత్రాన్ని ఓటింగ్‌కు సిద్ధం చేస్తారని వెల్లడించారు. ఈవీఎంల పంపిణీ కూడా ర్యాండమ్‌గా ఉంటుందని, కాబట్టి ఏ ఓటింగ్ యంత్రం ఏ పోలింగ్ కేంద్రానికి వెళుతుందో ముందుగా ఎవరూ చెప్పలేరని స్పష్టం చేసింది. పోలింగ్ ప్రక్రియ ప్రతి దశలో పార్టీల ఏజెంట్లు భాగస్వాములవుతారని పేర్కొంది. ఆర్జేడీ చేసిన ఆరోపణలను ఎన్నికల సంఘం తీవ్రంగా ఖండించింది. ఎన్నికలు జరిగిన రెండు విడతల్లోనూ ఆర్జేడీ ఒక్కసారి కూడా తమకు అభ్యంతరాలు చెప్పలేదని ఎన్నికల సంఘం తెలిపింది. ఆరోపణలు చేసిన ఆర్జేడీ నేత జగదానంద్ సింగ్ కూడా ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలను సమర్పించలేదని వెల్లడించింది. వాస్తవానికి, మాక్ పోల్ సర్టిఫికెట్లు, ఫామ్ 17సీ, ఇతర పత్రాలపై ఆర్జేడీకి చెందిన సొంత ఏజెంట్లు సంతకం చేశారని ఎన్నికల సంఘం అధికారులు గుర్తు చేశారు. అయితే, ఇప్పుడు తమ ఏజెంట్లు సంతకాలు చేసిన పత్రాలకు విరుద్ధంగా ఆర్జేడీ నాయకులు ఆరోపణలు చేస్తున్నట్లు ఎన్నికల సంఘం పేర్కొంది. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకున్న నమ్మకాన్ని దెబ్బతీసేందుకు ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని అధికారులు ఆక్షేపించారు. ఏదేమైనా, ఎన్నికల సంఘం ఈ ఆరోపణలను సాంకేతికపరంగా, చట్టపరంగా అసాధ్యమని తేల్చి చెప్పడం ద్వారా ఈ వివాదానికి తెరదించే ప్రయత్నం చేసింది.

# నవంబర్ 20న నితీశ్ ప్రమాణస్వీకారం

- స్పీకర్, హోంశాఖ కోసం పార్టీల పోరు
- ఎన్డీఏ భారీ విజయం – కూటమిలో కీలక చర్చలు



బిహార్‌లో నితీశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు సిద్ధమైంది. నవంబర్ 20న పట్నాలోని గాంధీ మైదానంలో నితీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడుతున్న నేపథ్యంలో క్యాబినెట్‌లో కీలక పదవుల కోసం జేడీ(యూ)-బీజేపీ మధ్య చర్చలు వేడెక్కాయి. స్పీకర్ పదవిని తమ పార్టీదేనని బీజేపీ పట్టుబడుతుండగా, హోంశాఖ విషయంలో రెండు పార్టీల మధ్య ఇంకా ఏకాభిప్రాయం కుదరలేదు. తాజా ఎన్నికల్లో ఎన్డీఏ భారీ విజయం సాధించగా, మొత్తం 243 స్థానాల్లో 202 స్థానాలను గెలుచుకుని మహాగఠ్‌బంధన్ ఆశలను దెబ్బతీశారు. బీజేపీ 89 స్థానాలతో అగ్రస్థానంలో నిలవగా, జేడీ(యూ) 85 స్థానాలు సాధించింది. ఈ బలం ఆధారంగా రెండు పార్టీలు స్పీకర్, హోంమంత్రి పదవులపై తమ హక్కు చాటుకుంటున్నాయి. రేపటిలోగా ఈ రెండు కీలక పదవులపై స్పష్టత వచ్చే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు.

ప్రభుత్వ ఏర్పాటుకు ముందస్తు వ్యూహాల నేపథ్యంలో జేడీ(యూ) నేతలు సంజయ్ ఝా, లలన్ సింగ్‌లు ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిశారు. ఈ కీలక సమావేశానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా హాజరయ్యారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్ షా హాజరవనున్నట్టు సమాచారం. రెండు విడతల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహాగఠ్‌బంధన్ పెద్ద ఆశలు పెట్టుకున్నప్పటికీ, ఫలితాలు ఎన్డీఏ వైపుకే పూర్తిగా మొగ్గుచూపాయి. తేజస్వీ యాదవ్ గెలుపొందినా, సీఎం అవకాశం దక్కలేదు. ఎన్నికల వ్యూహకర్తగా పేరొందిన ప్రశాంత్ కిశోర్‌ను ఓటర్లు తిరస్కరించగా, చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీకి ప్రజలు విశేషంగా మద్దతు తెలిపారు.

# హైడ్రా పై హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

సంధ్య కన్వెన్షన్ కూల్చివేతలపై దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు కఠినంగా స్పందించింది. కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ కూల్చివేతలు చేపట్టినందుకు హైడ్రా అధికారులపై పలు ప్రశ్నలు సంధించింది.

సంధ్య కన్వెన్షన్‌లో చేపట్టిన కూల్చివేతలు ఎవరి అనుమతి తీసుకుని చేశారు? ఎవరు చెప్పారని ఆ చర్యలు తీసుకున్నారు? అంటూ కోర్టు హైడ్రా అధికారులను హైకోర్టు నిలదీసింది. కోర్టు ముందస్తు ఆదేశాలు ఉన్నప్పటికీ వాటిని లెక్కచేయకుండా వ్యవహరించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేసింది. కాగా కూల్చివేతలపై స్పష్టమైన వివరణ ఇవ్వాలని కోర్టు అధికారులను ఆదేశించినట్టు తెలుస్తోంది. ఇక ఈ కేసులో ఇరు పక్షాల వాదనలు విన్న అనంతరం, తదుపరి విచారణను హైకోర్టు ఎల్లుండికి (గురువారం) వాయిదా వేసింది.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# బడ్జెట్ 2026-27 కోసం ప్రీ-బడ్జెట్ సమావేశానికి నేతృత్వం వహించిన నిర్మలా సీతారామన్

- క్యాపిటల్ మార్కెట్ ప్రతినిధులతో చర్చలు
- పెట్టుబడులు–ఆర్థిక స్థిరత్వంపై కీలక సూచనలు
- మంత్రులు, ఉన్నతాధికారులు హాజరు




రాబోయే యూనియన్ బడ్జెట్ 2026-27 తయారీ ప్రక్రియలో భాగంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నాల్గవ ప్రీబడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. క్యాపిటల్ మార్కెట్ రంగానికి చెందిన ప్రముఖ సంస్థలు, ప్రతినిధులు పాల్గొని పెట్టుబడి విధానాలు, మార్కెట్ స్థిరత్వం, పన్ను నిర్మాణం వంటి పలు కీలక అంశాలపై తమ సూచనలు తెలియజేశారు. ఈ సమావేశంలో యూనియన్ మంత్రి పంకజ్ చౌదరి, ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శి, భారత ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు కూడా పాల్గొన్నారు. ప్రస్తుత గ్లోబల్ ఆర్థిక పరిస్థితులు, పెట్టుబడి అవకాశాలు, కార్పొరేట్ రంగ అవసరాలపై విశ్లేషణాత్మక చర్చలు జరిగాయి. భారత ఆర్థిక వ్యవస్థను మరింత బలపడే దిశగా క్యాపిటల్ మార్కెట్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచే విధానాలు అవసరమని మంత్రి సీతారామన్ పేర్కొన్నట్టు సమాచారం. రాబోయే బడ్జెట్ రూపకల్పనలో ఈ సిఫార్సులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు కేంద్ర వర్గాలు వెల్లడించాయి.



# ప్రజల రక్షణే దేశ అత్యున్నత హక్కు

- ఉగ్రవాదం నుంచి ప్రజలను రక్షించుకునే హక్కు భారత్‌కు ఉంది: జైశంకర్
- తీవ్రవాదంపై రాజీలేని వైఖరి
- రష్యా విదేశాంగ మంత్రితో ద్వైపాక్షిక చర్చలు



కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ రష్యాలో జరుగుతున్న షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీవో) సమ్మిట్‌లో పాల్గొని, ఉగ్రవాదంపై భారత్ యొక్క దృఢమైన వైఖరిని మరోసారి స్పష్టం చేశారు. భారత ప్రజలను ఉగ్రవాద బెదిరింపుల నుంచి రక్షించుకునే హక్కు దేశానికి ఉందని ఆయన గట్టిగా తేల్చి చెప్పారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించకూడదన్న సందేశాన్ని అంతర్జాతీయ వేదికపై జైశంకర్ బలంగా వినిపించారు. ఈ సందర్భంగా ఆయన ఉగ్రవాదంపై పోరాటానికి ప్రపంచ దేశాల ఉమ్మడి సహకారం అవసరమని నొక్కి చెప్పారు, అలాగే ఉగ్రవాదంపై పోరాటం అనేది అన్ని దేశాలకు ఉమ్మడి ప్రాధాన్యతగా ఉండాలని సూచించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ యొక్క రాజీలేని వైఖరిని జైశంకర్ ఈ సదస్సులో పునరుద్ఘాటించారు. ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించరాదని, ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చే లేదా సమర్థించే ధోరణిని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని ఆయన తేల్చి చెప్పారు. ఉగ్రవాదం అనేది ప్రపంచ శాంతికి, భద్రతకు అత్యంత తీవ్రమైన ముప్పు అని, కాబట్టి దానిని ఎదుర్కోవడంలో ప్రపంచ దేశాలన్నీ ఏకమై, రాజీలేని పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ విషయంలో భారత్ తన దృఢ సంకల్పాన్ని అంతర్జాతీయ వేదికపై స్పష్టం చేసింది.

జైశంకర్ తన ప్రసంగంలో దేశ ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. భారత ప్రజలను ఉగ్రవాదం, హింసాత్మక దాడుల నుంచి రక్షించుకునే హక్కు, బాధ్యత సార్వభౌమ దేశంగా భారత్‌కు ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ రక్షణ హక్కు విషయంలో ఎటువంటి రాజీ ఉండదని, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో భారత్ వెనకడుగు వేయదని అంతర్జాతీయ సమాజానికి తేటతెల్లం చేశారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన పేలుడు వంటి సంఘటనల నేపథ్యంలో జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. మూడు రోజుల పర్యటనలో భాగంగా రష్యాలో పర్యటిస్తున్న జైశంకర్, ఎస్‌సీవో సదస్సులో పాల్గొనడానికి ముందు రష్యా విదేశాంగ మంత్రి సెర్గి లవ్రోవ్‌తో సమావేశమయ్యారు. ఈ కీలకమైన భేటీలో ఇరువురు నేతలు ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడంపై చర్చించారు. రక్షణ, వాణిజ్యం, ఇంధన రంగాల్లో సహకారంపై సమీక్ష జరిపి, ప్రాంతీయ పరిస్థితులు, అంతర్జాతీయ అంశాలపై కూడా అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ చర్చలు ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి దోహదపడతాయని అధికారులు తెలిపారు. ఎస్‌సీవో అనేది ఉగ్రవాదం, వేర్పాటువాదం, తీవ్రవాదాలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ఉద్దేశించిన ప్రాంతీయ భద్రతా కూటమి. ఇటువంటి ముఖ్యమైన వేదికపై కేంద్ర మంత్రి జైశంకర్ ఉగ్రవాదంపై గట్టిగా మాట్లాడటం, ప్రజల రక్షణ హక్కును బలంగా నొక్కి చెప్పడం అనేది ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చే శక్తులకు పరోక్షంగా హెచ్చరిక పంపినట్లు అయింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాల్సిన ఆవశ్యకతను ఆయన ఈ వేదికగా ప్రపంచ దేశాలకు గుర్తు చేశారు. ఉమ్మడి సహకారంతోనే ఉగ్రవాద సమస్యను పూర్తిగా నిర్మూలించగలమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# షేక్ హసీనా మరణశిక్షపై శశిథరూర్ కీలక వ్యాఖ్యలు

- తీర్పుపై భారత్ ఆందోళన
- భారత్‌కు అప్పగించాలని విజ్ఞప్తి
- అంతర్జాతీయ నేర ట్రిబ్యునల్ తీర్పు
- థరూర్ వ్యాఖ్యల్లో ఆందోళన





బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఆ దేశానికి చెందిన అంతర్జాతీయ నేర ట్రిబ్యునల్ మరణశిక్ష విధించడంపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత శశిథరూర్ కీలక వ్యాఖ్యలు చేశారు. హసీనాకు మరణశిక్ష విధించడం చాలా ఆందోళనకరమని ఆయన స్పష్టం చేశారు. ఒకవైపు వేరే దేశం యొక్క న్యాయవ్యవస్థ, అంతర్గత విషయాలపై తాను వ్యాఖ్యానించడం సరైనది కాదని పేర్కొన్నప్పటికీ, తాజా తీర్పు మాత్రం అంతర్జాతీయ సమాజంలో ఆందోళన కలిగించే అంశమని థరూర్ తన అభిప్రాయాన్ని తెలియజేశారు. ఈ కేసుల వెనుక రాజకీయ ప్రేరేపిత అంశాలు ఉన్నాయనే ఆరోపణల నేపథ్యంలో, ఈ తీర్పు ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. మరణశిక్ష విధించడం సరైందని తాను భావించడం లేదన్న థరూర్, ఏ కేసులో అయినా ప్రతి ఒక్కరికీ తమను తాము సమర్థించుకుంటూ వాదించుకునే అవకాశం తప్పనిసరిగా ఉండాలని, ఆ తర్వాతే ఇలాంటి కఠినమైన శిక్షలు విధించాలనే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. గత ఏడాది బంగ్లాదేశ్‌లో చోటు చేసుకున్న దేశవ్యాప్త తిరుగుబాటు నేపథ్యంలో హసీనా తన పదవికి రాజీనామా చేసి భారత్‌కు వచ్చారు. స్వాతంత్ర్య పోరాట వీరుల పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాలలో కోటా ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ ప్రారంభమైన విద్యార్థి నిరసనలు, చివరకు మహమ్మద్ యూనస్ నేతృత్వంలో మధ్యంతర ప్రభుత్వం ఏర్పాటుకు దారితీశాయి.

హసీనా అధికారంలో ఉన్నప్పుడు స్వదేశంలో జరిగిన ఆందోళనలను అణిచివేసేందుకు అమానవీయంగా వ్యవహరించారనే ఆరోపణల మేరకు ఆమెపై కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల విచారణ అనంతరమే ఐసీటీ తాజాగా తీర్పు వెలువరించింది. ఈ ట్రిబ్యునల్ హసీనాను దోషిగా తేల్చి మరణశిక్ష విధించడం గమనార్హం. దీనితో, ప్రస్తుతం భారత్‌లో ఉన్న హసీనాను తమకు అప్పగించాలంటూ మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వం భారత్‌కు అధికారికంగా విజ్ఞప్తి చేసింది. కాగా, హసీనాపై నమోదు చేసిన కేసులు మరియు తాజా తీర్పు పక్షపాతంతో కూడినవి, పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవి అని ఆమె పక్షం వారు మొదటి నుంచీ వాదిస్తున్నారు. ఈ మొత్తం పరిణామం బంగ్లాదేశ్ రాజకీయాలలో ఒక కీలక మలుపుగా పరిగణించబడుతోంది. హసీనా అనుచరులు, అభిమానులు ఈ తీర్పుపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. భారత్‌లో శరణార్థిగా ఉన్న మాజీ ప్రధానిని తిరిగి అప్పగించాలనే యూనస్ ప్రభుత్వ విజ్ఞప్తిపై భారత ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ప్రస్తుతం ఉత్కంఠగా మారింది. మొత్తం మీద, బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య ప్రక్రియ, న్యాయవ్యవస్థ యొక్క విశ్వసనీయతపై అంతర్జాతీయంగా అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్న నేపథ్యంలో, శశిథరూర్ చేసిన వ్యాఖ్యలు ఈ వ్యవహారంలో భారతదేశం యొక్క సున్నితమైన వైఖరిని సూచిస్తున్నాయి. ఈ రాజకీయ, న్యాయపరమైన సంక్షోభం భారతబంగ్లాదేశ్ ద్వైపాక్షిక సంబంధాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందనేది తదుపరి చర్చనీయాంశంగా ఉంది. భారత్ ప్రభుత్వం తీసుకునే నిర్ణయం బంగ్లాదేశ్ యొక్క అంతర్గత రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేసే అవకాశం ఉంది.




# జాతీయ నీటి అవార్డులు ప్రదానం చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము


- జల్ సంచయ్–జన్ భాగిదారి అవార్డుల ప్రదానం
- ప్రమాణానికి తగ్గ నీటి వనరులు – సమర్థ వాడకం అత్యవసరం
- వ్యక్తి నుంచి ప్రభుత్వానికీ నీటి సంరక్షణలో భాగస్వామ్యం కీలకం




రాష్ట్రపతి ద్రౌపది ముర్ము న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆరో జాతీయ నీటి అవార్డులు మరియు జల్ సంచయ్-జన్ భాగిదారి అవార్డులను ప్రదానం చేశారు. నీటి సంరక్షణ, సమర్థ వినియోగం, సమాజ భాగస్వామ్యంతో నిర్వహణలో ప్రతిభ కనబరిచిన రాష్ట్రాలు, సంస్థలు, వ్యక్తులను ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో మాట్లాడిన రాష్ట్రపతి ముర్ము, నీటి వనరులు దేశ జనాభాకు సరిపడేంతగా లేవని, అందుకే నీటిని సమర్థవంతంగా వినియోగించడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. పెరుగుతున్న జనాభా, వేగవంతమైన పట్టణీకరణ, వాతావరణ మార్పులు కలిసి నీటి భద్రతను సవాలు చేస్తున్నాయని ఆమె తెలిపారు. నీటి నిర్వహణ, భూగర్భ జలాల సంరక్షణ, వర్షపు నీటి సంచయానికి ప్రభుత్వంతో పాటు ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తి బాధ్యతగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని రాష్ట్రపతి స్పష్టం చేశారు. సమాజం, ప్రభుత్వం కలిసి పనిచేసినప్పుడే నీటి అత్యవసరతను అధిగమించగలమని ఆమె అభిప్రాయపడ్డారు. జల వనరుల పరిరక్షణలో సమగ్ర దృక్పథం అవసరమని, ఇందులో గ్రామీణ సంస్థలు, పాఠశాలలు, స్థానిక సంస్థలు, యువత కూడా భాగస్వామ్యం కావాలని రాష్ట్రపతి పిలుపునిచ్చారు. జాతీయ నీటి అవార్డులు, జల్ సంచయ్ జన్ భాగిదారి అవార్డులు నీటి సంరక్షణలో ఉన్నత ప్రమాణాలు పాటిస్తున్న వారిని ప్రోత్సహించే వేదికగా నిలుస్తున్నాయని అధికారులు తెలిపారు.

# డ్రోన్ దాడులకు ఉగ్రకుట్ర భగ్నం

- ఎన్ఐఏ దర్యాప్తులో సంచలన నిజాలు వెల్లడి
- హమాస్ తరహా పన్నాగం
- సమన్వయ దర్యాప్తుతో ముందస్తు విజయం





ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన కార్ బాంబు పేలుడు కేసు దర్యాప్తులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అత్యంత కీలకమైన విషయాలను వెలుగులోకి తెచ్చింది. దేశంపై ఇజ్రాయెల్‌పై పాలస్తీనాకు చెందిన హమాస్ తరహాలో డ్రోన్ దాడులు నిర్వహించడానికి ఉన్నత విద్యావంతులైన ఉగ్రవాదులు ఒక భయంకరమైన కుట్రను పన్నినట్లు ఎన్ఐఏ గుర్తించింది. ఈ నెట్‌వర్క్‌లో వైద్యులు, ఇంజనీర్లు వంటి సాంకేతిక నిపుణులు ఉన్నారని దర్యాప్తు అధికారులు వెల్లడించారు. ఎన్ఐఏ దర్యాప్తులో భాగంగా, కారు బాంబు పేల్చిన సూసైడ్ బాంబర్ డా. ఉమర్ ఉన్ నబీకి సహకరించినవారిపై దృష్టిసారించింది. ఇందులో భాగంగా, 'వైట్ కోట్ టెర్రరిస్టు'కు సహకరించిన అమీర్ రషీద్ అలీని అరెస్టు చేసి, 10 రోజుల కస్టడీకి తీసుకున్నారు. ఆ తర్వాత, ఇదే ఉగ్ర మాడ్యుల్‌కు చెందిన మరో కీలక వ్యక్తి జాసిర్ బిలాల్ వాని అలియాస్ డానిష్‌ను శ్రీనగర్‌లో అరెస్టు చేశారు. ఈ మాడ్యుల్ మొత్తం వైట్ కోట్ టెర్రరిస్టులు, టెర్రర్ డాక్టర్లుగా వ్యవహరిస్తున్న ఉన్నత విద్యావంతులతో నిండినట్లు తేలింది.

హమాస్ తరహా పన్నాగం

తాజాగా అరెస్టయిన డానిష్ ఇచ్చిన సమాచారంతోనే ఉగ్రవాదుల హమాస్ తరహా డ్రోన్ దాడుల కుట్ర బహిర్గతమైంది. ఎర్రకోట వద్ద జరిగిన పేలుడులో వాడిన అమ్మోనియం నైట్రేట్‌తో పాటు TATP వంటి ప్రమాదకర పేలుడు పదార్థాలను పాశ్చాత్య దేశాల ఉగ్రవాద గ్రూపులు వినియోగిస్తున్నట్లు ఫోరెన్సిక్ నిపుణులు గుర్తించారు. ఇజ్రాయెల్‌పై హమాస్, హెజ్బుల్లా గ్రూపులు డ్రోన్లను ఉపయోగించి దాడులు చేసిన తరహాలోనే, భారత భద్రతా వ్యవస్థపై డ్రోన్ల ద్వారా భారీ విధ్వంసం సృష్టించడానికి ఈ ఉన్నత విద్యావంతులైన ఉగ్రవాదులు తమ మేధస్సును ఉపయోగిస్తున్నారని దర్యాప్తులో వెల్లడైంది. ఈ కుట్రలో డానిష్ వంటి సాంకేతిక నిపుణులతో పాటు డా. షాహీన్, డా. ముజమ్మిల్, డా. ఉమర్ వంటి వైద్య నిపుణులు కూడా భాగమయ్యారు.

సమన్వయ దర్యాప్తుతో ముందస్తు విజయం

వాస్తవానికి, జమ్ముకశ్మీర్ నౌగాం పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌తో మొదలైన దర్యాప్తులో, తొలుత డా. ఆదిల్, డా. ముజమ్మిల్ అరెస్టయ్యారు. జమ్మూ కశ్మీర్ పోలీసులు, హర్యానా పోలీసులతో కలిసి ఫరీదాబాద్‌లో ఏకంగా 2,900 కేజీల పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. తెలుగు ఐపీఎస్ అధికారి డా. సందీప్ చక్రవర్తి చాకచక్యంతో, భద్రతా బలగాల అప్రమత్తతతో ఈ టెర్రర్ మాడ్యూల్‌ను ముందుగానే పసిగట్టగలిగారు. అయితే, అప్పటికే ఆలస్యం కావడంతో ఎర్రకోట కార్ బాంబ్ పేలుడు జరిగింది. కేసు తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కేంద్రం ఎన్ఐఏను రంగంలోకి దించింది. డానిష్‌ను శ్రీనగర్ నుంచి ఢిల్లీలోని ఎన్ఐఏ ప్రధాన కార్యాలయానికి తరలించి, మంగళవారం పాటియాలా హౌజ్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం అతడిని 10 రోజుల ఎన్ఐఏ కస్టడీకి అప్పగించింది. ఇప్పటికే కస్టడీలో ఉన్న అమీర్ రషీద్ అలీతో పాటు తాజాగా అరెస్టయిన డానిష్ ఇచ్చే సమాచారంతో ఈ ఉగ్ర కుట్రలను పూర్తిగా నిర్వీర్యం చేయడానికి దర్యాప్తు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

# ముంబైలో ముగ్గురు విద్యావంతులైన అనుమానితులు అరెస్టు



దేశ రాజధాని ఢిల్లీలో ఇటీవల జరిగిన పేలుడు ఘటనకు సంబంధించిన దర్యాప్తు ఇప్పుడు మహారాష్ట్ర రాజధాని ముంబైకి చేరింది. ఈ పేలుడు ఘటనలో 15 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ కేసు మూలాలు వివిధ రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నందున, కేంద్ర దర్యాప్తు సంస్థలు సోదాలు, అరెస్టులను ముమ్మరం చేశాయి. ముఖ్యంగా, సోషల్ మీడియా, ఇతర డిజిటల్ మాధ్యమాల ద్వారా ఈ కేసుతో సంబంధం కలిగిన వ్యక్తులను గుర్తించడంపై ఏజెన్సీలు ప్రధానంగా దృష్టి సారించినట్లు ముంబై పోలీసు వర్గాలు వెల్లడించాయి. తాజాగా ముంబైలోని వివిధ ప్రాంతాల్లో కేంద్ర ఏజెన్సీలు కోవర్ట్ ఆపరేషన్ నిర్వహించి, ముగ్గురు అనుమానితులను నిర్బంధంలోకి తీసుకున్నాయి. అరెస్టు అయిన ఈ ముగ్గురూ విద్యాధికులే కాకుండా, ఉన్నత కుటుంబాల నుంచి వచ్చినవారని తెలుస్తోంది. దర్యాప్తు సంస్థలు ముంబై పోలీసుల సహాయం తీసుకుని ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశాయి. నిర్బంధంలోకి తీసుకున్న అనుమానితులను తదుపరి విచారణ నిమిత్తం ఢిల్లీకి తరలించినట్లు సమాచారం. పోలీసు వర్గాల సమాచారం ప్రకారం, ఈ ముగ్గురు అనుమానితులు ప్రధాన నిందితుడితో ఒక నిర్దిష్ట మొబైల్ అప్లికేషన్ ద్వారా సంప్రదింపులు సాగించారు. కీలకమైన సమాచారాన్ని పంచుకోవడానికి వారు ఆ యాప్‌ను ఉపయోగించినట్లు దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. విచారణలో వెలుగులోకి వస్తున్న సమాచారం ఆధారంగా, మహారాష్ట్రలోని వివిధ జిల్లాల్లో మరింత గాలింపు చర్యలు కొనసాగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.




# ప్రియదర్శి కొత్త సినిమా 'ప్రేమంటే' ట్రైలర్

టాలీవుడ్ యువ నటుడు ప్రియదర్శి, ఆనంది జంటగా నటించిన చిత్రం 'ప్రేమంటే'. 'థ్రిల్‌యు ప్రాప్తిరస్తు' ఉపశీర్షిక. ఈ సినిమాకు నవనీత్ శ్రీరామ్ దర్శకత్వం వహించగా రానా దగ్గుబాటి సమర్పణలో పుస్కూర్ రామ్మోహన్ రావు, జాన్వి నారంగ్ నిర్మిస్తున్నారు. సుమ కనకాల కీలక పాత్రలో నటిస్తుంది. ఈ చిత్రం నవంబర్ 21న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా సోమవారం ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. కొత్తగా పెళ్లి అయిన జంట జీవితంలోని ప్రేమ, గొడవలు, సరదా సంఘటనలు, సంతోషాల కలబోతగా ఈ సినిమా రాబోతుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. 'లైఫ్ అంతా ఇలానే ఉంటే బాగుండు కదా.. రోజూ హనీమూన్‌లాగా..' అనే డైలాగ్ మెప్పించింది. ప్రియదర్శి తనదైన కామెడీతో ఆకట్టుకున్నాడు. సుమ కనకాల కానిస్టేబుల్ పాత్రలో కనిపించింది. ఆద్యంతం హాస్యప్రధానంగా ట్రైలర్ మెప్పించింది. సకుటుంబ సమేతంగా చూసి ఆనందించే చిత్రమిదని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి లియోన్ జేమ్స్ సంగీతం అందిస్తున్నాడు.



# చిక్కుల్లో దర్శక ధీరుడు..

## హనుమంతుడిని అవమానించారంటూ కేసు నమోదు

'వారణాసి' టైటిల్ లాంచింగ్ కార్యక్రమంలో హనుమంతుడిని అవమానించేలా వ్యాఖ్యలు చేశారంటూ దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళిపై రాష్ట్రీయ వానరసేన సంస్థ ఫిర్యాదు నమోదు చేసింది. ఈ ఫిర్యాదును సోమవారం సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో అధికారులకు అందజేశారు. ఫిర్యాదులో రాజమౌళి చేసిన వ్యాఖ్యలు హిందువుల భావాలను తీవ్రంగా దెబ్బతీశాయని వానరసేన పేర్కొంది. ఇటీవలి కాలంలో సినిమాల్లో హిందూ దేవతలను అవమానించే ధోరణి పెరుగుతోందని, దీనిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. మత విశ్వాసాలను దెబ్బతీయడం చట్ట విరుద్ధం. రాజమౌళిపై కేసు నమోదు చేసి, సమగ్ర విచారణ జరపాలి" అని సంస్థ సభ్యులు డిమాండ్ చేశారు.సంస్థ పోలీసులకు సమర్పించిన ఫిర్యాదులో సినీ రంగంలో ఇలాంటి వ్యాఖ్యలు, ప్రవర్తనలకు అడ్డుకట్ట వేయాలని స్పష్టంగా పేర్కొంది. మతపరమైన భావాలను కించపరిచే వ్యాఖ్యలను ఉద్దేశపూర్వకంగా చేయకూడదని, ఇలాంటి ఘటనలు మరల జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరింది. ఫిర్యాదు నమోదయ్యాక ఈ అంశం సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారితీసింది. అభిమానులు, సినీ ప్రేమికులు విభిన్న అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది రాజమౌళిని తప్పుబడుతుంటే, మరికొందరు ఆయన వ్యాఖ్యలు అపార్థం చేశారంటూ సమర్థిస్తున్నారు. పోలీసులు ఫిర్యాదు స్వీకరించిన అనంతరం కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. 'వారణాసి' ఈవెంట్‌లో రాజమౌళి చేసిన కామెంట్స్ రాబోయే రోజుల్లో రాజకీయ, సామాజిక వర్గాల్లో కూడా చర్చనీయాంశంగా మారే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇక వారణాసి విషయానికి వస్తే ఈ చిత్రం రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతుండగా, ఇందులో మహేష్ బాబు, ప్రియాంక చోప్రా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాకి సంబంధించి ఇటీవల విడుదలైన గ్లింప్స్ ఫ్యాన్స్‌కి మాంచి కిక్ ఇచ్చింది. 2027లో మూవీని విడుదల చేసే ప్లాన్‌లో ఉన్నారు.




# తెలుగు నేర్చుకుంటున్న ప్రియాంక చోప్రా..

సూపర్ స్టార్ మహేష్ బాబు- దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో పాన్ ఇంటర్నేషనల్ ప్రాజెక్ట్ రూపొందుతున్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ 'వారణాసి' టైటిల్ అనౌన్స్‌మెంట్ హైదరాబాద్ రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగిన గ్లోబ్ ట్రాటర్ ఈవెంట్‌లో గ్రాండ్‌గా జరిగింది. మహేష్ ఫస్ట్‌లుక్, గ్లింప్స్‌తో జక్కన్న ప్రపంచానికి కొత్త రూపాన్ని పరిచయం చేస్తే, బాలీవుడ్ స్టార్ ప్రియాంక చోప్రా ఈవెంట్‌లో సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌గా నిలిచారు. స్టేజ్‌పైకి వచ్చిన ప్రియాంక చోప్రా తెలుగులో "హలో హైదరాబాద్", "తగలబెట్టేద్దామా?" అంటూ అభిమానులను పలకరించడంతో హాల్ అంతా హర్షధ్వనులతో మార్మోగింది. ఈ క్యూట్ తెలుగు డైలాగులు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఈవెంట్ కోసం ప్రత్యేకంగా తెలుగు ప్రాక్టీస్ చేసిన వీడియోను కూడా ఆమె షేర్ చేయగా, ఆ డెడికేషన్‌పై నెటిజన్లు ఫిదా అవుతున్నారు. "సినిమాలో కంటె లైవ్ స్టేజ్‌పై తెలుగు మాట్లాడడం చాలా కష్టం" అంటూ ప్రియాంక చెప్పిన మాటలు అందరి దృష్టిని ఆకర్షించాయి. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక డైరీ మెయింటైన్ చేస్తున్నట్లు వెల్లడించారు. 'వారణాసి' చిత్రంలో ప్రియాంకనే హీరోయిన్ అని నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. ఆమె 'మందాకిని' పాత్రలో కనిపించనున్నారు.ఇప్పటికే విడుదలైన ఆమె ఫస్ట్‌లుక్ భారీ హైప్ క్రియేట్ చేస్తుంది. గుహలో దేవతా విగ్రహాల మధ్య చీర కట్టుకుని గన్ పట్టుకుని కనిపించిన మాస్ అవతారం అందరినీ ఆశ్చర్యపరిచింది.టీజర్‌లో ప్రత్యేకంగా చూపించిన చిన మస్తానా దేవి టెంపుల్ సన్నివేశం చర్చనీయాంశమైంది. ప్రమాదంలో చిక్కుకున్న ప్రియాంకను హీరో కాపాడే విజువల్స్ థ్రిల్లింగ్‌గా అనిపించాయి. చిన మస్తా దేవి తాంత్రిక పూజల్లో ఆరాధించే రౌద్రరూపం. ముఖ్యంగా టిబెటిన్ తాంత్రిక సంప్రదాయాల్లో ఈ దేవికి ప్రత్యేక స్థానం ఉంది. చిన్న మస్తా, ప్రచండ చండిక, జోగని మా వంటి పేర్లతో కూడా పిలుస్తారు. టీజర్‌లో ఈ దేవి విగ్రహం చుట్టూ రూపొందించిన సన్నివేశాలు సినిమాకు కీలకం కానున్నాయని తెలుస్తోంది. ఈ పాత్రను రాజమౌళి ఎలా తీర్చిదిద్దారు? ఏ ప్రపంచంలో ఆమె పాత్ర విస్తరించబోతుంది? అనేదానిపై అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. మహేష్ – రాజమౌళి కాంబినేషన్‌కు తోడు ప్రియాంక చోప్రా శక్తివంతమైన పాత్రలో కనిపించబోతుండటంతో 'వారణాసి'పై ఎక్స్‌పెక్టేషన్స్ మరింత పెరిగాయి.

# రామ్-భాగ్యశ్రీ ప్రేమ రూమర్‌లకు చెక్...


## 'ఆంధ్రా కింగ్ తాలూకా' ప్రమోషన్స్‌లో హీరో క్లారిటీ



టాలీవుడ్‌లో ఎనర్జిటిక్ స్టార్‌గా పేరొందిన రామ్ పోతినేని ప్రస్తుతం తన తాజా చిత్రం 'ఆంధ్రా కింగ్ తాలూకా' తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఈ సినిమాతో కొత్త అంచనాలు రేకెత్తిస్తున్నాడు. నవంబర్ 27న విడుదలకు సిద్ధమైన ఈ సినిమా రామ్ కెరీర్‌లో మరో కీలక అడుగుగా భావిస్తున్నారు. 'ఇస్మార్ట్ శంకర్' విజయానంతరం వేర్వేరు జానర్లలో ప్రయోగాలు చేస్తూ ముందుకు సాగుతున్న రామ్, ఈసారి మాస్‌తో పాటు ఎమోషన్ కలిసిన కథతో రాబోతున్నాడు. సినిమా రిలీజ్ సమీపిస్తున్న నేపథ్యంలో రామ్ వ్యక్తిగత జీవితం సోషల్ మీడియాలో పెద్ద చర్చగా మారింది. ముఖ్యంగా రామ్, హీరోయిన్ భాగ్యశ్రీ ప్రేమలో ఉన్నారని వార్తలు హల్‌చల్ చేశాయి. ఇద్దరూ ఒకే హోటల్‌లో కనిపించినట్లు సోషల్ మీడియాలో పోస్ట్ అయిన ఫోటోలతో రూమర్‌లకు మరింత బలం చేకూరింది. అంతేకాక, సినిమాలోని "నువ్వుంటే చాలు" పాటను రామ్ స్వయంగా రాయడం, ఆ పాట భాగ్యశ్రీ కోసమే రాశాడన్న ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి.ఈ క్రమంలో రామ్ ఈ రూమర్‌లపై స్పష్టమైన సమాధానం ఇచ్చాడు. మేమిద్దరం ప్రేమలో ఉన్నామన్న వార్తల్లో ఒక్క శాతం నిజం లేదు. నేను రాసిన సాంగ్ టైమ్‌కు హీరోయిన్ కూడా ఫైనల్ కాలేదు. కాబట్టి చూడని అమ్మాయి కోసం ఎలా పాట రాస్తాను? అని రామ్ ప్రశ్నించాడు.అలాగే, ప్రస్తుతం ప్రేమపై ఎలాంటి ఇంట్రస్ట్ లేదు. ఎవరి మీదా ఆ ఫీలింగ్ కూడా లేదు అని చెప్పి ప్రేమ, పెళ్లి గాసిప్‌లకు పూర్తిగా చెక్ పెట్టేశారు. రామ్ క్లారిటీ ఇచ్చినప్పటికీ సోషల్ మీడియాలో అభిమానులు మాత్రం సరదాగా స్పందిస్తున్నారు. "వయసు పెరుగుతోంది రామ్... ఇంకెప్పుడు పెళ్లి?", హీరోయిన్స్‌తో రూమర్ వచ్చినప్పుడల్లా ఎందుకు డినై చేస్తున్నావ్?" అంటూ జోకులు చేస్తున్నారు. కొంతకాలంగా హిట్ కోసం ఎదురుచూస్తున్న రామ్, ఈ చిత్రంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాడు. ప్రమోషన్స్‌లో రామ్ చూపిస్తున్న ఎనర్జీ, సినిమా టీం క్రియేట్ చేస్తున్న బజ్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలు పెంచుతోంది.

# బాలయ్య సినిమాలో నయనతార.. అధికారిక ప్రకటన

నటసింహం నందమూరి బాలకృష్ణ, దర్శకుడు గోపీచంద్ మలినేనిల హిట్ కాంబినేషన్ మరోసారి రిపీట్ కాబోతుంది. బ్లాక్‌బస్టర్ చిత్రం 'వీర సింహా రెడ్డి' ఘన విజయం తర్వాత ఈ ఇద్దరూ కలిసి రెండో చిత్రం చేయబోతున్న విషయం తెలిసిందే. ఎన్‌బీకే111 అంటూ రాబోతున్న ఈ ప్రాజెక్ట్ నవంబర్ 26న పూజ కార్యక్రమాలు జరుపుకోబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి కథానాయికను పరిచయం చేశారు మేకర్స్. ఈ సినిమాలో హీరోయిన్‌గా తమిళ బ్యూటీ నయనతార నటించబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా స్పెషల్ వీడియోను పంచుకుంది. గతంలో వీరిద్దరూ 'సింహా', 'శ్రీరామ రాజ్యం', 'జై సింహా' వంటి విజయవంతమైన చిత్రాల్లో కలిసి నటించారు. దీంతో ఇప్పుడు నాలుగోసారి ఈ జంట జోడి కట్టబోతుంది.ఇది చరిత్ర, వర్తమానం మేళవింపుగా సాగే ఒక శక్తిమంతమైన యాక్షన్ డ్రామాగా రూపొందనుంది. ఇందులో బాలకృష్ణ రెండు విభిన్న కోణాల్లో కనిపించనున్నట్లు సమాచారం. ముఖ్యంగా ఒక పాత్రలో రాజుగా అలరించనున్నారని సమాచారం. ఈ పాత్ర బాలయ్య అభిమానులకు పెద్ద విందు కానుంది. ఈ భారీ యాక్షన్ డ్రామాను వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు.




# ఓటీటీలోకి ధృవ్ విక్రమ్ 'బైసన్'..

కోలీవుడ్ నటుడు చియాన్ విక్రమ్ తనయుడు ధృవ్ విక్రమ్ నటించిన స్పోర్ట్స్ డ్రామా చిత్రం 'బైసన్' ఈ సినిమాకు మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించగా.. గత నెల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. థియేటర్‌లో సూపర్ హిట్‌ను అందుకున్న ఈ చిత్రం తాజాగా ఓటీటీ అనౌన్స్‌మెంట్‌ను పంచుకుంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో ఈ చిత్రం నవంబర్ 21 నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు ప్రకటించింది. తమిళంతో పాటు తెలుగు, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో ఈ సినిమా ఒకేసారి అందుబాటులోకి రాబోతుంది. ధృవ్ విక్రమ్, అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రల్లో నటించగా. పశుపతి, రజిషా విజయన్, అమీర్ తదితరులు కీలకపాత్రలు పోషించారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## వృద్ధుల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం

**పెద్దమందడి,నవంబర్18(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలంలోని మద్దిగట్ల గ్రామంలో మంగళవారం వృద్ధుల దినోత్సవం సందర్భంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు వృద్ధాప్యంలో తల్లి దండ్రులను బాధ్యతగా చూసుకోవాలని అధికారులు సూచించారు.

వృద్ధులను బెదిరించి ఆస్తులను అక్రమంగా స్వాధీనం చేసుకునే వారి మీద కేసులు నమోదు చేసి కఠిన శిక్షలు, జరిమానాలు విధించాలని అధికారులు తెలిపారు. వృద్ధుల ఆస్తులు, వారి ఆయుష్షు ఉన్నంతవరకు వారి పేరుపై కొనసాగేలా చూడాలని సూచించారు.

సీనియర్ సిటిజన్లు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా కలెక్టర్ మరియు సంబంధిత రెవెన్యూ అధికారులకు నివేదిక అందజేస్తామని గ్రామ పంచాయతీ ప్రతినిధులు పేర్కొన్నారు. అనంతరం వృద్ధుల సంక్షేమం కోసం గ్రామస్తులు ప్రతిజ్ఞ చేశారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పరిపాలన అధికారి గోపాల్ రావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్ రెడ్డి, డాక్టర్ ప్రవళిక, అంగన్వాడి ఉపాధ్యాయురాలు చెన్నమ్మ, ఆశ కార్యకర్త కళావతి, పారిశుధ్య కార్మికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## సోదరుడి వివాహానికి మాజీ ఎంపీ రాములు ను ఆహ్వానించిన డిఎస్ మహేష్

**వనపర్తి,నవంబర్18(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు డి.ఎస్. మహేష్ తమ సోదరుడు హంసు వర్మ వివాహానికి హాజరు కావాలని మాజీ పార్లమెంట్ సభ్యులు రాములు కు ఆహ్వాన పత్రికను అందజేశారు. మంగళవారం మాజీ ఎంపీ రాములును మర్యాదపూర్వకంగా కలిసి శుభలేఖను అందజేసిన మహేష్, ఈ నెల 30వ తేదీన కొత్తకోటలోని ఏటీఆర్ కన్వెన్షన్ హాల్లో జరగనున్న హంసు వర్మ-హైకోర్టు ఏజీపీ వివాహ మహోత్సవానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహేష్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఖాసీంను కూడా కలిసి వివాహానికి ఆహ్వానించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డి ఎస్ మహేష్, మాణిక్ వర్మ, వెంకటేష్ పాల్గొన్నారు.

## ఎంట్రీతోనే అదరగొట్టిన ఫిజిక్స్‌వాలా.. 33 శాతం ప్రీమియంతో లిస్టింగ్..

ప్రముఖ ఎడ్‌టెక్ యూనికార్న్ సంస్థ ఫిజిక్స్ వాలా ఐపీఓ అదరగొట్టింది. ఈ కంపెనీ షేర్లు మంగళవారం దేశీయ స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయ్యాయి. ఎంట్రీలోనే అదరగొట్టాయి. ఏకంగా 33 శాతం ప్రీమియంతో లిస్టింగ్ అయ్యాయి. ఈ ఐపీఓ ధర రూ. 109తో పోలిస్తే జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజీ ఎన్ఎస్ఈలో ఈ స్టాక్ రూ. 145 వద్ద ట్రేడింగ్ మొదలు పెట్టింది. ఇక బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ బీఎస్ఈలో రూ. 143.10 వద్ద లిస్టింగ్ అయింది. ఎంట్రీతోనే తమ ఇన్వెస్టర్లకు కాసుల వర్షం కురిపించింది. ఆ తర్వాత కూడా రాణిస్తోంది. మరి ఈ ఐపీఓ ప్రైస్ బ్యాండ్, లిస్టింగ్ సహా పూర్తి వివరాలు తెలుసుకుందాం.ఫిజిక్స్‌వాలా ఐపీఓకు బిడ్డింగ్ తొలి రోజున ఆదరణ అంతంత మాత్రంగానే ఉంది. అయితే చివరి రోజు మాత్రం ఇన్వెస్టర్ల నుంచి అనూహ్య స్పందన కనిపించింది. ఈ పబ్లిక్ ఇష్యూలో భాగంగా 18,62,04,143 షేర్లు ఆఫర్ చేశారు. అయితే, ఏకంగా 33,62,27,044 షేర్లకు బిడ్లు వచ్చాయి. రూ. 3480 కోట్లు సమీకరించే లక్ష్యంతో ఈ పబ్లిక్ ఇష్యూ వచ్చింది. ఇందులో ఒక్కో షేరుకు ప్రైస్ బ్యాండ్ రూ. 103 109గా నిర్ణయించారు. ఈ ఐపీఓలో రూ. 3100 కోట్లు విలువైన ఫ్రెష్ షేర్లు జారీ చేయగా రూ. 380 కోట్లు విలువైన ఆఫర్ ఫర్ సేల్ ద్వారా ప్రమోటర్లు తమ వాటాను విక్రయించారు.దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాల్లో ట్రేడవుతున్నాయి. వరుస లాభాలకు బ్రేక్ పడింది. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపిన క్రమంలో వరుస లాభాలకు కళ్లెం పడినట్లయింది. మధ్యాహ్నం 1 గంటల సమయంలో సెన్సెక్స్ 177 పాయింట్ల నష్టంతో 84,773 పాయింట్ల వద్ద ట్రేడవుతోంది. ఇక నిఫ్టీ 50 ఇండెక్స్ 70 పాయింట్లు కోల్పోయి 25,943 పాయింట్ల వద్ద కొనసాగుతోంది. నిఫ్టీ బ్యాంక్ సూచీ మాత్రం 22 పాయింట్ల లాభంతో 58,985 పాయింట్ల వద్ద ట్రేడవుతోంది. ఇక నిఫ్టీ మిడ్ క్యాప్ 100 ఇండెక్స్ 260 పాయింట్ల మేర కోల్పోయింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాల ప్రభావం దేశీయ మార్కెట్ సూచీలపై స్పష్టంగా కనిపించింది. సోమవారం అమెరికా మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. ఆసియా మార్కెట్లలోనూ మిశ్రమ ఫలితాలు ఉన్నాయి. దీంతో దేశీయంగా మదుపరులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. దీంతో కీలక రంగాల్లోని దిగ్గజ కంపెనీల షేర్లు అమ్మకాల ఒత్తిడికి గురవుతున్నాయి.

# అంగరంగ వైభవంగా మాజీ డిప్యూటీ సిఎం రాజయ్య,ఫాతిమా మేరీల వివాహ వార్షికోత్సవ వేడుకలు

### రాజయ్య దంపతులకు శుభాకాంక్షల వెల్లువ

### శుభాకాంక్షలు చెప్పేందుకు క్యూ కట్టిన నాయకులు,అభిమానులు

**స్టేషన్ ఘనపూర్, నవంబర్18(తెలంగాణ ముచ్చట్లు):** స్టేషన్ ఘనపూర్ శివారులోని మాజీ ఎమ్మెల్యే రాజయ్య వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ స్టేషన్ ఘనపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో మాజీ డిప్యూటీ సిఎం డాక్టర్ తాటికొండ రాజయ్య, ఫాతిమా మేరీ దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. కార్యక్రమం జరుగుతున్న ప్రాంతం మొత్తంలో ఉత్సాహభరితమైన వాతావరణం నెలకొంది.ఉదయం నుంచే పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు, అభిమానులు హన్మకొండలోని రాజయ్య క్యాంపు కార్యాలయానికి చేరుకుని దంపతులకు బొకేలు,శాలువాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ ఘనపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే రాజయ్య ఫాతిమా మేరీ దంపతులు పాల్గొని వారు ఏర్పాటు కేకును కోసి అభిమానులు,బిఆర్ఎస్ పార్టీ శ్రేణుల మధ్య 45వ వివాహ వార్షికోత్సవ వేడుకలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ...ప్రజా జీవితంలో నిత్యం ప్రజలకు చేరువగా ఉండే రాజయ్య,ఫాతిమా మేరీ దంపతులు 45 సంవత్సరాల దాంపత్యాన్ని పూర్తి చేసుకోవడం ఆదర్శనీయమని పేర్కొన్నారు. ప్రజలతో కలిసిమెలిసి ఉండే వారి స్వభావం పార్టీ శ్రేణులలో విశ్వాసాన్ని పెంచుతుందన్నారు. దంపతులు ఆరోగ్యంగా, ఆనందంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

అనంతరం రాజయ్య మాట్లాడుతూ.... ప్రజలు చూపుతున్న ప్రేమాభిమానాలు,మద్దతు తనకు అత్యంత బలమని తెలిపారు. 45 ఏళ్లుగా ఫాతిమా మేరీ జీవన ప్రయాణంలోని ప్రతి దశలో తోడుగా నిలిచిందని చెప్పారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం తనకు ఆలయం లాంటిదని, ప్రజలు తనకు దిక్సూచులని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో తొలి ఉప ముఖ్యమంత్రి పదవి ప్రజల నమ్మకంతో వచ్చిన వరమని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మరింత మంది నేతలను తీర్చిదిద్దే దిశగా కృషి చేస్తానని, శ్రేణుల విజయం కోసం నిరంతరంగా పనిచేస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, యువత, మహిళలు మరియు సామాజిక మాధ్యమ విభాగం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.














## తెలుగు రాష్ట్రాల్లో ఎలక్ట్రిక్ కార్లకు భలే డిమాండ్




తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో టాప్ ఎండ్ లగ్జరీ కార్లు, బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాల (బీఈవీ)కు రోజురోజుకు డిమాండ్ పెరిగిపోతోందని మెర్సిడెస్ బెంజ్ ఇండియా వెల్లడించింది. మెర్సిడెస్ కార్ల విక్రయాల్లో ఈ రెండు రాష్ట్రాలు చాలా కీలకంగా ఉన్నాయని సంస్థ ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ అన్నారు. టాప్ ఎండ్ లగ్జరీ కార్లు, బీఈవీ విభాగంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో మెర్సిడెస్ బెంజ్ అగ్రగామిగా ఉందని ఆయన చెప్పారు. దేశంలో ఏటా 50,000 పైగా లగ్జరీ కార్ల విక్రయాలు నమోదవుతున్నాయని, ఇందులో మెర్సిడెస్ బెంజ్ వాటా 45 శాతంగా ఉందన్నారు. కాగా కంపెనీ లగ్జరీ కార్ల విక్రయాల్లో తెలుగు రాష్ట్రాల వాటా 15 శాతంగా ఉండగా బీఈవీ అమ్మకాల్లో 10 శాతంగా ఉందని ఆయన చెప్పారు. భారత్‌లో మొత్తం ఈవీ విక్రయాల్లో కంపెనీ వాటా సగటున 8 శాతం ఉండగా తెలుగు రాష్ట్రాల్లో అంతకు మించి ఉండటం విశేషమని ఆయన పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ కార్లకు సంబంధించి సానుకూల పన్ను విధానాలు, చార్జింగ్ మౌలిక సదుపాయాలతో పాటు అధికాదాయ వర్గాల (హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్, హెచ్ఎన్ఐ) వారు ఎక్కువగా ఉండటంతో అమ్మకాలు భారీగా ఉంటున్నాయని అయ్యర్ వెల్లడించారు.హైదరాబాద్‌లో తొలి మేబాక్ లాంజ్: మెర్సిడెస్ బెంజ్ టాప్ ఎండ్ లగ్జరీ కార్లకు ఉన్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్‌లో ప్రత్యేకంగా మేబాక్ లాంజ్‌ను ఏర్పాటు చేసినట్లు సంతోష్ అయ్యర్ తెలిపారు. ప్రస్తుతం మెర్సిడెస్ బెంజ్‌కు హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం కీలక మార్కెట్లుగా ఉన్నాయని, ఇక్కడ మొత్తం 10 సేల్స్, సర్వీస్ పాయింట్లను నిర్వహిస్తున్నట్లు అయ్యర్ తెలిపారు. విస్తరణలో భాగంగా త్వరలో విశాఖపట్నంలో మూడో ఫ్రాంచైజీ భాగస్వామిని నియమించుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ఏటా 20,000 కార్ల తయారీ: మహారాష్ట్ర, పుణె సమీపంలోని చకన్‌లో రూ.3,000 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన మెర్సిడెస్ ప్లాంట్‌లో ఏటా 20,000 కార్లను ఉత్పత్తి చేస్తున్నట్లు అయ్యర్ తెలిపారు. గత ఏడాది కంపెనీ విక్రయాలు 19,500 యూనిట్ల వరకు ఉన్నాయని, ఈ ఏడాది కూడా అదే స్థాయిలో ఉంటాయని అంచనా వేస్తున్నట్లు ఆయన చెప్పారు. జీఎస్‌టీ 2.0తో అమ్మకాలు ఆశించిన స్థాయిలో పెరిగాయని తెలిపారు. అయితే యూరో మారకంలో రూపాయి బలహీనపడటంతో వచ్చే ఏడాది జనవరి నుంచి ధరలు పెంచాలని నిర్ణయించినట్లు అయ్యర్ వెల్లడించారు. మెర్సిడెస్ బెంజ్ భారత పోర్టుఫోలియోలో మొత్తం 25 కార్లు ఉండగా అందులో 11 కార్లను స్థానికంగా పుణెలో ప్లాంట్‌లో ఉత్పత్తి చేస్తున్నట్లు అయ్యర్ వివరించారు. ఇందులో రెండు ఎలక్ట్రిక్ కార్లను ఇక్కడే తయారు చేస్తున్నట్లు చెప్పారు. కాగా వచ్చే రెండేళ్లలో మెర్సిడెస్ ప్రపంచవ్యాప్తంగా 40 కొత్త మోడళ్లను విడుదల చేయనుండగా అందులో 11 మోడళ్లను భారత్‌లోనే తయారు చేసే అవకాశం ఉందన్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in